

మహానాడు వేదికగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయం. మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చే పార్టీగా టీడీపీ నిలిచింది. ఈ నిర్ణయం ప్రకటించిన లోకేష్, సీఎం చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 28.05.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 36 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00







# టీడీపీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్

- 2029 ఎన్నికల్లో అమలు చేస్తామని మహానాడులో నారా లోకేష్ ప్రకటన
- మహిళా నాయకత్వమే దేశ భవిష్యత్తని వ్యాఖ్య

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** 2029 సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించిందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి వచ్చినా రాకపోయినా టీడీపీ మహిళలకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తుందని స్పష్టం చేశారు. మహానాడు వేదికగా ఆయన ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి కార్యకర్తల నుంచి విశేష స్పందన లభించింది.

మహిళలు కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా నిర్ణయాలు తీసుకునే నాయకులుగా ఎదగాలని పార్టీ భావిస్తోందన్నారు. "ఇది మా సంకల్పం, మా బాధ్యత, మా కమిట్‌మెంట్" అని లోకేశ్ పేర్కొన్నారు. భారత రాజకీయాల తదుపరి దశ మహిళా నాయకత్వానిదేనని తాను గట్టిగా నమ్ముతున్నానన్నారు. మహిళా సాధికారత విషయంలో తెలుగుదేశం పార్టీ సిద్ధాంతపరంగానే కాకుండా ఆచరణలో కూడా ముందుంటుందని తెలిపారు. మహిళలను అవమానించే వ్యాఖ్యలను సమాజం తిరస్కరించాలని పిలుపునిచ్చారు. పాఠ్యపుస్తకాలలో కూడా లింగ సమానత్వం ప్రతిబింబించేలా మార్పులు చేస్తున్నామని వెల్లడించారు. మహానాడు నిర్వహణపై స్పందిస్తూ, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ లేదా హైబ్రిడ్ మోడల్ ఏదైనా టీడీపీ కార్యకర్తల ఉత్సాహం తగ్గదన్నారు. "టీమ్-11కి బ్యాటింగ్ తప్పదు" అంటూ వైసీపీపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు.

తెలుగుదేశం పార్టీ స్థాపకుడు ఎన్. టి. రామారావు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని లోకేశ్ కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధికి ఎన్టీఆర్ పునాది వేశారని పేర్కొన్నారు. మహిళలకు ఆస్తి హక్కులు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిన తొలి నాయకుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని ప్రశంసించిన లోకేష్, మిగతా 2లో...



## మహిళలకు 33 శాతం రిజర్వేషన్
# లోకేష్ ప్రకటన చారిత్రాత్మకం



- మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చే పార్టీగా టీడీపీ నిలిచింది
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** మహానాడు వేదికగా రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమని తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చే పార్టీగా తెలుగుదేశం పార్టీ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు.

బుధవారం తెనాలిలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మహిళల రాజకీయ సాధికారతకు ఇది గొప్ప ముందడుగని కొనియాడారు. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించిన నారా లోకేష్ కు, ముఖ్యమంత్రిఎన్. నారా చంద్రబాబు నాయుడు కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మహానాడు వేడుకలు అద్భుతంగా జరుగుతున్నాయని అన్నారు.

రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని తీర్మానం చేయడం సాధారణ విషయం కాదని, అది మహిళల సాధికారతపై ఉన్న నిజమైన నిబద్ధతకు నిదర్శనమని ఆలపాటి రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యానించారు. దేశంలో అనేక మంది నాయకులు మహిళల అభ్యున్నతి గురించి మాట్లాడతారని, - 2లో...




# దేశంలో మండుతున్న ఎండలు.. ప్రజలకు జాగ్రత్తలు చెప్పిన ప్రధాని

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు రాష్ట్రాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు పలు సూచనలు చేశారు. నీరు ఎక్కువగా తాగాలని.. వీలైనంతవరకు మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లొద్దని పేర్కొన్నారు. అతి తీవ్రమైన వాతావరణ పరిస్థితుల నుంచి తమను తాము కాపాడుకోవాలని.. వృద్ధులను గమనిస్తూ ఉండాలని సూచించారు. వీలైతే ఇతరులకు కూడా సాయం చేయాలని.. ఇళ్లు, దుకాణాల బయట పక్షులు, జంతువుల కోసం నీటిని ఉంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

తల తిరగడం, వికారం, అలసట వంటి వడదెబ్బ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దని ప్రధాని మోదీ ప్రజలకు సూచించారు. చుట్టూ ఉన్నవారిలో ఎవరైనా అకస్మాత్తుగా స్పృహ కోల్పోయినట్లు అనిపించినా, నీరసించినా వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలన్నారు. ఇటువంటి సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడగలమన్నారు. ఈ మండుటెండల వల్ల పిల్లలు, వృద్ధులు, కార్మికులు, రైతులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని పేర్కొన్నారు. మిగతా 2లో...

## వెంటిలేటర్‌పై ఉన్న
# ఏపీని తిరిగి నిలబెట్టాం

- నెక్స్ట్ జెనరేషన్ కోసం టీడీపీ పని చేస్తోంది
- జెన్ జీ, జెన్ ఆల్ఫాకు విస్తృత అవకాశాలు అందిపుచ్చుకోవాలి
- రక్తచరిత్ర రాసేవాళ్లు స్వర్ణాంధ్ర చరిత్ర రాయలేరు : సీఎం చంద్రబాబు
- మహిళల పోరాటాలకు గౌరవంగా మహానాడు అంకితం
- జై తెలుగుదేశం నినాదాలతో మార్మోగిన మహానాడు
- హైబ్రిడ్ మహానాడుకు భారీ స్పందన



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల కోసం కాదు.. భవిష్యత్ తరాల కోసం పనిచేసే పార్టీ తెలుగుదేశమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఐదేళ్లు విధ్వంసం చేస్తే, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టిందని పేర్కొన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి నిలబెట్టి, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను పునరుద్ధరించామని తెలిపారు.

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం వేదికగా బుధవారం ప్రారంభమైన మహానాడు సమావేశంలో సీఎం ప్రసంగించారు. ప్రభుత్వం సాధించిన విజయాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, యువత-మహిళల సాధికారత, అభివృద్ధి లక్ష్యాలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. ఈసారి మహానాడును వర్చువల్, హైబ్రిడ్ విధానంలో నిర్వహించగా, రాష్ట్రవ్యాప్తంగా 1,864 క్లస్టర్ల నుంచి సుమారు 2.23 లక్షల మంది కార్యకర్తలు పాల్గొన్నారు. మిగతా 2లో...

# బాలికల ఆరోగ్య రక్షణే లక్ష్యం



- బాలికా రక్ష కార్యక్రమంతో 13 లక్షల బాలికలకు లాభం
- మెన్స్ట్రువల్ హైజీన్ డే సందర్భంగా ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యక్రమాలు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** యౌవన బాలికల్లో ఆరోగ్య అవగాహన, శుభ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "బాలికా రక్ష కార్యక్రమం" ను సమర్థవంతంగా అమలు చేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా అమలవుతున్న మెన్స్ట్రువల్ హైజీన్ స్కీమ్‌ను 2024లో మిగతా 2లో...

## రూ.8,500 కోట్లతో
# గోదావరి మహా పుష్కరాల ప్రణాళిక



- ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు - నిబంధనలు ఉల్లంఘిస్తే పరిశ్రమలకు తాళాలు

**రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరి నది కాలుష్య నివారణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. గోదావరి పవిత్రతకు భంగం కలిగిస్తే ఎంతటి పరిశ్రమనైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. రాజమహేంద్రవరం హుకుంపేట కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రెండు రోజుల పర్యటనతో అధికార యంత్రాంగంలో కొత్త ఉత్సాహం, బాధ్యత పెరిగిందన్నారు.

గోదావరిలోకి మురుగు నీరు, రసాయన వ్యర్థాలు విడుదల చేసే వారిపై ఇకపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. నదిలోకి కాలుష్య నీటిని విడుదల చేస్తే సంబంధిత యజమానులను నేరుగా జైలుకు పంపే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరిశ్రమలు ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి లాభాలు పొందే ప్రయత్నం చేస్తే ప్రభుత్వం సహించదన్నారు.

గోదావరి కాలుష్య నివారణ కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డును నోడల్ ఏజెన్సీగా నియమిస్తూ ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన జీవో కూడా జారీ అయిందన్నారు. త్వరలోనే గోదావరి నదిపై సమగ్ర 'పొల్యూషన్ ఆడిట్' నిర్వహించి కాలుష్యానికి కారణమవుతున్న అంశాలను గుర్తిస్తామని చెప్పారు. మిగతా 2లో...

## విజయన్ నివాసంపై
# ఈడీ దాడులు



**కేరళ(జర్నలిస్ట్ ఫైల్) :** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పది ప్రాంతాల్లో ఈడీ దాడులు చేపట్టగా.. వాటిలో మాజీ సీఎం నివాసం కూడా ఒకటి. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఈ తనిఖీలు జరిగాయి.

కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ నుంచి ఎక్సలాజిక్ సొల్యూషన్స్ సంస్థకు రూ.2.73 కోట్లు దక్కాయి. దానికి బదులుగా ఎలాంటి ఐటీ సేవలు అందించలేదు. - 2లో...

# విద్యుత్ అంతరాయాల నివారణకు చర్యలు



- అంతరాయాలపై ప్రజలకూ సమగ్ర సమాచారం అందించాలి
- ప్రజలను, విద్యుత్ శాఖనూ కాల్ సెంటర్లు సమన్వయం చేయాలి
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ అంతరాయాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధిక వేడి, అకాల గాలివానలతో ఫీడర్లు తెగిపోయి విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్న పరిస్థితిపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ బుధవారం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధిక ఉష్ణోగ్రతలు, గాలివానల ప్రభావంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అధిక వేడి, ఈదురు గాలులు, భారీ వర్షాల కారణంగా ట్రాన్స్‌మిషన్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., విద్యుత్ అంతరాయాలపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఇందుకు గానూ.. మీడియా, బల్క్ మెసేజ్ వ్యవస్థలను సమర్థంగా వినియోగించాలని సూచించారు. కాల్ సెంటర్లు విద్యుత్ శాఖకు, వినియోగదారులకు సమన్వయ వ్యవస్థగా పని చేయాలన్నారు. 24 గంటలు పనిచేసే 1912 కాల్ సెంటర్లు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. మిగతా 2లో...

## టీడీపీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్



(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్తంగా "సీబీఎన్" అనే పేరు గౌరవం పొందుతోందన్నారు. ఐటీ నుంచి ఏఐ వరకు, సైబరాబాద్ నుంచి అమరావతి వరకు అభివృద్ధికి చంద్రబాబు దూరదృష్టి కారణమని తెలిపారు.


టీడీపీలో కార్యకర్తలే అధినేతలని పేర్కొన్న లోకేష్, 2019 నుంచి 2024 వరకు పార్టీ కార్యకర్తలు చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. అరెస్టులు, కేసులు, ఒత్తిడులకు భయపడకుండా కార్యకర్తలు పార్టీ కోసం నిలబడ్డారని అన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ 94 శాతం స్ట్రైక్ రేట్‌తో 164 స్థానాలు గెలుచుకోవడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. పెన్షన్లు, అన్న క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, ఉచిత విద్యుత్, మహిళా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు.

అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు తాను సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరిన లోకేశ్, రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా వస్తున్నాయని చెప్పారు. గూగుల్, ఫైటర్ జెట్ ప్రాజెక్టులు, పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్ వైపు వస్తున్నాయని వెల్లడించారు.

వైసీపీపై తీవ్ర విమర్శలు చేసిన లోకేశ్, ఫేక్ ప్రచారాలను కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. నమో అంటే నాయుడు, మోదీ అని పేర్కొంటూ కేంద్ర–రాష్ట్ర సమన్వయంతో పోలవరం, అమరావతి, విశాఖ రైల్వే జోన్ వంటి ప్రాజెక్టులు సాధ్యమయ్యాయని అన్నారు.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్...
## లోకేష్ ప్రకటన చారిత్రాత్మకం



(మొదటి పేజీ తరువాయి)

కానీ ఇలాంటి ధైర్యమైన నిర్ణయం తీసుకునే సంకల్పం ఉన్న నాయకుడు మంత్రి లోకేష్ అని గర్వంగా చెబుతున్నానన్నారు.

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినా, పొందకపోయినా తెలుగుదేశం పార్టీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని మంత్రి లోకేష్ ప్రకటించడం ఆయన గొప్ప నాయకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. మహిళల పట్ల గౌరవం, వారికి రాజకీయంగా సమాన అవకాశాలు కల్పించాలనే ఆలోచన ఎంత బలంగా ఉందో ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందన్నారు.

నాయకుడు అంటే కేవలం పదవి కాదని, సమాజానికి దిశానిర్దేశం చేసే వ్యక్తి అని ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆ లక్షణాలు మంత్రి లోకేష్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయని చెప్పారు. మహిళల గౌరవం కోసం, వారి భవిష్యత్తు కోసం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చరిత్ర సృష్టిస్తుందని అభిప్రాయపడ్డారు.

యువ నాయకత్వం అంటే ఏమిటో, మహిళల పట్ల నిబద్ధత ఎలా ఉండాలో దేశానికే ఆదర్శంగా నిలిచేలా మంత్రి లోకేష్ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉంటుందని, భవిష్యత్తులో మహిళలకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పించే దిశగా ఇది కీలక ముందడుగని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

## ప్రైవేటుకు ఫైటర్ జెట్ ప్రాజెక్ట్



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** అత్యాధునిక ఫైజర్ జెట్స్ అభివృద్ధిలో స్వావలంబన దిశగా కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక మధ్యశ్రేణి కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (ఏఎమ్‌సీఏ) అభివృద్ధి కోసం తొలిసారిగా ప్రైవేటు సంస్థల నుంచి ప్రతిపాదనలు కోరుతూ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) ప్రకటనను విడుదల చేసింది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఎల్అండ్‌టీ బీఈఎల్–డైనమాటిక్ కన్సార్షియంతో పాటు భారత్ ఫోర్జ్–బీఈఎమ్ఎల్–డాటా పాటర్న్స్ కన్సార్షియంకు ఈ 5వ తరం ఫైటర్ జెట్‌కు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించేందుకు కేంద్రం అవకాశం ఇచ్చింది.

రూ. 15 వేల కోట్ల విలువైన ఈ ప్రభుత్వ కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థలకు ఏఎమ్‌సీఏకు సంబంధించి ఐదు ప్రొటోటైప్ మోడల్స్ (నమూనా), ఒక ప్రయోగాత్మక ఫైటర్‌జెట్‌ను నిర్మించే అవకాశం దక్కుతుంది. ఫైటర్ జెట్ అభివృద్ధిని వేగవంతం చేసేందుకు, స్వావలంబన సాధించేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు నిధులను కేంద్రం పూర్తిస్థాయిలో సమకూరుస్తుంది. అయితే, ప్రాజెక్టును దక్కించుకున్న ప్రైవేటు సంస్థలు ఎయిరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ), డీఆర్‌డీఓతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. పుట్టపర్తిలో (ఏపీ) 650 ఎకరాల్లో ఏర్పాటవుతున్న ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్టింగ్ కాంప్లెక్స్‌లో ఏఎమ్‌సీఏ అభివృద్ధి చేపట్టనున్నారు.

ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఏడీఏ, డీఆర్‌డీఓ 2025లో ఒక ప్రకటనను విడుదల చేశాయి. ఫైటర్ జెట్ అభివృద్ధిపై ఆసక్తిగల వారు తమను సంప్రదించాలని కోరాయి. ఇందుకు 7 సంస్థలు స్పందించగా మూడు సంస్థలు మలిదశకు ఎంపికయ్యాయి. ఈ సంస్థలు తమ బిడ్స్‌ను సమర్పించేందుకు ప్రభుత్వం మూడు నెలల సమయం ఇచ్చింది. వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రాజెక్టు కేటాయింపు పూర్తయ్యే అవకాశం ఉంది.

# వెంటిలేటర్‌పై ఉన్న ఏపీని తిరిగి నిలబెట్టాం

(మొదటి పేజీ తరువాయి)



**"జై తెలుగుదేశం"తో ప్రారంభం :** "జై తెలుగుదేశం" నినాదంతో ప్రసంగం ప్రారంభించిన చంద్రబాబు.. వర్చువల్ విధానం కారణంగా వాహనాల హోరు తగ్గినా, కార్యకర్తల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా ఈసారి మహానాడును హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు.

"కూడు, గూడు, గుడ్డ" నినాదంతో ఆవిర్భవించిన టీడీపీ, విజన్ పాలిటిక్స్‌కు రూపం ఇచ్చిందన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవమైతే, పసుపు జెండా తెలుగువారికి ఆత్మగౌరవమని వ్యాఖ్యానించారు.

**కార్యకర్తల త్యాగాలను గుర్తుచేసిన సీఎం :** టీడీపీపై దాడులు, అక్రమ కేసులు, హింస జరిగినా కార్యకర్తలు వెనక్కి తగ్గలేదని చంద్రబాబు కొనియాడారు. చంద్రయ్య వంటి కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయినా పార్టీ జెండాను వదల్లేదని గుర్తుచేశారు. గత ప్రభుత్వ కాలంలో తనను అక్రమంగా జైలుకు పంపించారని, నారా లోకేష్ యువగళం పాదయాత్రను అడ్డుకున్నారని, అనేక మంది నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు బీజేపీ, జనసేనలతో కలిసి కూటమి ఏర్పాటు చేశామని, ప్రజలు అపారమైన మద్దతు ఇచ్చారని చెప్పారు.

**మహిళల విజయానికి మహానాడు అంకితం :** మహిళా సాధికారత కోసం టీడీపీ కట్టుబడి ఉందని చంద్రబాబు తెలిపారు. ఆస్తి హక్కుల నుంచి "తల్లికి వందనం" వరకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ సాధించే వరకు టీడీపీ పోరాడుతుందని పేర్కొన్నారు.

"స్త్రీ శక్తి" పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, "దీపం 2.0" ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దామని, మరో ఐదు లక్షల మందిని ఎంట్రప్రెన్యూర్లుగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

గత ఎన్నికల్లో మహిళలే విజయానికి ప్రధాన కారణమని, అందుకే ఈ మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నామని ప్రకటించారు.

**జెన్ జీ, జెన్ ఆల్ఫాకు అవకాశాల వెల్లువ :** యువత కోసం భవిష్యత్ దృష్టితో విధానాలు రూపొందిస్తున్నామని సీఎం తెలిపారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆలోచనలకు అనుగుణంగా ఏఐ, క్వాంటం, స్పేస్, ఏరోస్పేస్, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

గత 23 నెలల్లో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, వాటి ద్వారా 23 లక్షల ఉద్యోగాలకు అవకాశం కలిగిందన్నారు. ఇప్పటికే రూ. 11.27 లక్షల కోట్ల పెట్టుబడులతో 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని వెల్లడించారు.

"ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" లక్ష్యంగా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నామని చెప్పారు. కేవలం 36 రోజుల్లో ఫైటర్ జెట్ తయారీ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రాజెక్టు రావడం కూడా అదే వేగానికి నిదర్శనమన్నారు.

**సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలన :** రాష్ట్రంలో 23 నెలల్లోనే రూ. 63 వేల కోట్లకు పైగా సామాజిక భద్రతా పింఛన్ల కోసం ఖర్చు చేశామని సీఎం పేర్కొన్నారు. రైతులకు "అన్నదాత సుఖీభవ" కింద ఏడాదికి రూ. 14 వేల సాయం అందిస్తున్నామని తెలిపారు.

ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ. 1.50కే అందిస్తామని, మత్స్యకారులకు 200 మెకనైజ్డ్ బోట్లు సబ్సిడీపై ఇస్తామని చెప్పారు.

సంజీవని ప్రాజెక్టు ద్వారా ఆరోగ్యరంగంలో సంస్కరణలు చేపట్టామని, ఆగస్ట్ 15 నుంచి డిజిటల్ హెల్త్ రికార్డులు అమలు చేస్తామని తెలిపారు. విద్యారంగంలో పేరెంట్–టీచర్ సమావేశాలు, పాఠ్యాంశ మార్పులతో ఏపీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

**పోలవరం పూర్తి చేస్తాం :** పోలవరం ప్రాజెక్టును పుష్కరాలకంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో డయాఫ్రమ్ వాల్ ధ్వంసమైందని, దానిని రూ. 1,000 కోట్లతో పునర్నిర్మించామని చెప్పారు. వెలిగొండ, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీటిని విస్తరిస్తామని తెలిపారు.

**పేదలకు కావాల్సింది సంక్షేమం.. కత్తిపోట్లు కాదు :** వైసీపీకి రాజధానిపై విజన్ లేదని చంద్రబాబు విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు అన్నారు, ఇప్పుడు "మావిగన" అంటున్నారని ఎద్దేవా చేశారు.

"వాళ్లకు గోల్ లేదు.. అదొక అడ్డగోలు బ్యాచ్" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. విశాఖ రైల్వే జోన్ కోసం భూమి ఇవ్వలేకపోయారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రైల్వే జోన్ సాధ్యమైందన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టించామని చెప్పారు.

"పేదలకు కావాల్సింది సంక్షేమం.. గొడ్డలివేట్లు కాదు. యువతకు కావాల్సింది ఉద్యోగాలు.. కత్తిపోట్లు కాదు. రక్తాభిషేకాలు చేసే వారు స్వర్ణాంధ్ర చరిత్రను లిఖించలేరు" అని వ్యాఖ్యానించారు. దేశంలో ఏ పార్టీకి లేని బలమైన కేడర్ టీడీపీ సొంతమని చంద్రబాబు అన్నారు. క్రమశిక్షణ, కమిట్‌మెంట్‌తో పనిచేసే కార్యకర్తలే పార్టీ బలమన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ. 160 కోట్లు ఖర్చు చేశామని, మై హెల్త్ యాప్ ద్వారా కార్యకర్తల ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని, మిత్రపక్షాలతో సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. "హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ" లక్ష్యంగా పనిచేద్దామని, స్వర్ణాంధ్ర సాధన కోసం మహానాడు సాక్షిగా పునరంకితం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

## రూ.8,500 కోట్లతో గోదావరి మహా పుష్కరాల ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)



ఆంధ్రా పేపర్ మిల్లు యాజమాన్యంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీకి చెల్లించాల్సిన రూ. 13 కోట్ల బకాయిలు ఇప్పటికీ చెల్లించలేదని విమర్శించారు. వ్యర్థాల శుద్ధి పేరుతో గోదావరిలోకి కాలుష్య నీటిని విడుదల చేస్తున్నారనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. పర్యావరణ ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

2027 గోదావరి మహా పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం రూ. 8,500 కోట్లతో భారీ ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి తెలిపారు. పుష్కరాలు జరిగే ఆరు జిల్లాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 100 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈసారి పుష్కరాలను పూర్తిగా ప్లాస్టిక్ రహితంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు.

భక్తుల సౌకర్యార్థం కుంభమేళా తరహాలో టెంట్ సిటీలు, హోమ్ స్టేలు, ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఏ ఘాట్‌లో స్నానం చేసినా ఒకే పుణ్యఫలం లభిస్తుందని ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

విజ్జేశ్వరం - సిద్ధాంతం ఏటిగట్టు రహదారి అభివృద్ధికి రూ. 66 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి వెల్లడించారు. 33 కిలోమీటర్ల ఈ రహదారి అభివృద్ధి వల్ల నిడదవోలు, పెరవలి మండలాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.

కేంద్ర సహకారంతో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టును అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. హేవలాక్ బ్రిడ్జి, బ్రిడ్జిలంక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభించామని వెల్లడించారు. పుష్కర్ ఘాట్ అభివృద్ధి కూడా ఈ ప్రాజెక్టులో భాగమేనన్నారు.

సినిమా రంగానికి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు, ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహణపై ఎఫ్‌డీసీ బృందం కసరత్తు చేస్తోందన్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి ప్రత్యేక వ్యూహం రూపొందించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు ఇంచార్జులు, ప్రతి జిల్లాకు అధ్యక్షులను త్వరలో నియమిస్తామని వెల్లడించారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

## విద్యుత్ అంతరాయాల నివారణకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)



ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు, క్షేత్రస్థాయి సిబ్బంది మధ్య 1912 కాల్ సెంటర్లు సమన్వయ వేదికలుగా పని చేయాలని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా.. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ల పనులను మరింత వేగవంతం చేయాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సబ్ స్టేషన్లు, ఫీడర్ల సామర్థ్యాన్ని పెంచుతూ అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. దీని వలన రాబోయే పదేళ్ల వరకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ట్రాన్స్ మిషన్ నష్టాలను తగ్గించవచ్చన్నారు. దీనితో పాటు దీర్ఘకాలిక విద్యుత్ సమస్యల పరిష్కారంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయాల సమయంలో వేగంగా స్పందించేందుకు అదనపు సీపీటీ గ్యాంగులను ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సేవల విభాగాల్లో కింద స్థాయి సిబ్బంది అప్రమత్తత కూడా చాలా కీలకమని మంత్రి గుర్తు చేశారు. అన్ని జిల్లాల ఎసఈలు ప్రతి రోజూ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని కోరారు. దీనితో క్షేత్రస్థాయిల సిబ్బందిలోనూ జవాబుదారీ వస్తుందన్నారు. ఇటువంటి చర్యలతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు లభిస్తాయన్నారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశానికి విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్ వర్చువల్ విధానంలో హాజరయ్యారు. ట్రాన్స్‌కో జేఎండీ, డిస్కంల సీఎండీలు, డైరెక్టర్లు, సీఈలు, క్షేత్రస్థాయి ఎసఈలు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దేశంలో మండుతున్న ఎండలు..
## ప్రజలకు జాగ్రత్తలు చెప్పిన ప్రధాని

(మొదటి పేజీ తరువాయి)




రాబోయే రోజుల్లో మధ్య, వాయువ్య భారతంలోని అనేక ప్రాంతాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రధాని ఈ సూచనలు చేశారు.

హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ

రాబోయే రోజుల్లో ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హరియాణా, రాజస్థాన్, బిహార్, ఒడిశా, తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోని భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మే 29 నుంచి ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## నూతన కమిటీల ప్రమాణస్వీకారం



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** తెలుగుదేశం పార్టీ ప్రత్తిపాడు నియోజక వర్గ అనుబంధ కమిటీలలో ఎంపికైన వారిచే స్థానిక శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు మహానాడు డిజిటల్ కార్యక్రమం లో భాగంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా కాకుమాను మండలంలో ఐటీడీపి ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షులు గా గింజపల్లి నవీన్, ఎస్ సి సెల్ ఉపాధ్యక్షునిగా మద్దు సూర్య తేజ పలువురు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రతి ఒక్కరు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమం లో మండలం నాయకులు మామిళ్లపల్లి రాంగోపాల్, సునీల్ చౌదరి,నక్కల ఆగస్టిన్, కొల్లా వీరయ్య చౌదరి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల ఆరోగ్య రక్షణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



"బాలికా రక్ష కార్యక్రమం"గా పునర్నామకరణం చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలలు మరియు హాస్టళ్లలో 7వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు ప్రతి నెలా 10 శానిటరీ న్యాప్కిన్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 13 లక్షల మంది బాలికలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు.

ఈ కార్యక్రమం ద్వారా ఋతుక్రమంపై ఉన్న అపోహలు, సంకోచాలను తొలగించడం, శుభ్రతపై అవగాహన పెంపొందించడం, బాలికల ఆరోగ్యం, గౌరవం, విద్యా కొనసాగింపును ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. పాఠశాలల్లో వాడిన శానిటరీ న్యాప్కిన్లను సురక్షితంగా నిర్వీర్యం చేసేందుకు పొగరహిత ఇన్సినిరేటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, అడోలెసెంట్ హెల్త్ కౌన్సెలర్లు బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. "బాలికల ఆరోగ్యం, గౌరవం, విద్యా భవిష్యత్తు పరిరక్షణలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోంది. పీరియడ్ ఫ్రెండ్లీ సొసైటీ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని మంత్రి స్పష్టం చేశారు.

మే 28న నిర్వహించే "మెన్స్ట్రువల్ హైజీన్ డే" సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, కౌన్సెలింగ్ సెషన్లు, కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (చీఖీనూ) గణాంకాల ప్రకారం 15–24 సంవత్సరాల మహిళల్లో శానిటరీ ప్యాడ్ల వినియోగం 56 శాతం నుంచి 69 శాతానికి పెరిగిందని, గుడ్డ వినియోగం 43 శాతం నుంచి 36 శాతానికి తగ్గిందని వెల్లడించారు. భవిష్యత్తులో పాఠశాలల్లో ఏఐ ఆధారిత అవగాహన కార్నర్లు ఏర్పాటు చేసి, బాలికల ఆరోగ్య ట్రాకింగ్ వ్యవస్థను కూడా అమలు చేయనున్నట్లు మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## విజయన్ నివాసంపై ఈడీ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎక్సలాజిక్ సొల్యూషన్స్ విజయన్ కుమార్తె టి.వీణకు చెందిన కంపెనీ. రెండు సంస్థల మధ్య అధికారిక ఒప్పందం ఉన్నప్పటికీ.. అవి మోసపూరితంగా ఉన్నాయని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ తన అభియోగాల్లో పేర్కొంది. 2023 ఆగస్టులో ఆ అంశం వెలుగులోకి వచ్చింది. 2017 నుంచి 2020 మధ్యలో సీఎంఆర్ఎల్ నుంచి రూ. 1.72 కోట్లు పొందినట్లు ఆ ఆరోపణల సారాంశం. ఆ నేపథ్యంలో పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని ఎస్ఎఫ్ఐఓకు గతంలోనే కేంద్రం నుంచి ఆదేశాలు అందాయి. ఈ కేసు విషయంలో వీణపై ఈడీ మనీ లాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ క్రమంలోనే మాజీ సీఎం నివాసం సహా పలు ప్రాంతాల్లో నేడు ఈడీ సోదాలు చేపట్టింది. కొయికోడ్‌లోని మాజీ మంత్రి మహమ్మద్ రియాస్ నివాసం పైనా ఈ దాడులు జరిపింది.

**సీఎం సతీశన్ క్యాబినెట్ మంత్రులపై ఆరోపణలు..:** కేరళ సీఎం వీడీ సతీశన్ క్యాబినెట్‌లోని ఇద్దరు వ్యక్తులకు కూడా సీఎంఆర్ఎల్ నుంచి నిధులు అందాయని వామపక్ష నేత ఎంఏ బేబీ ఆరోపించారు. సీఎంఆర్ఎల్ చెల్లింపు వివాదంపై రాష్ట్రంలో వివాదం నడుస్తోన్న సమయంలో ఈ వ్యాఖ్యలు వచ్చాయి.

**ఈడీ రెయిడ్స్.. కేరళం మాజీ సీఎం తీవ్ర ఆగ్రహం:** సీఎంఆర్ఎల్ కేసులో ఈడీ తన నివాసంలో రెయిడ్స్ నిర్వహించడంపై కేరళం మాజీ సీఎం పినరయి విజయన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈడీ సోదాల వెనుక రాహుల్ గాంధీ ఉన్నారని ఆరోపించారు. తనను అరెస్టు చేసేందుకు రాహుల్ కుట్రపన్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి ఈ పని చేస్తున్నాయని మండిపడ్డారు.

నేడు మాజీ సీఎం పినరయి విజయన్, ఆయన కుటుంబసభ్యులకు చెందిన పలు నివాసాల్లో ఈడీ రెయిడ్స్ నిర్వహించిన విషయం తెలిసిందే. విజయన్ కూతురు వీణా విజయన్‌కు చెందిన ఐటీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ నుంచి ఎలాంటి సేవలు పొందకుండానే కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) రూ. 2.7 కోట్ల నిధులు చెల్లించిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ సోదాలు నిర్వహించింది.

మరోవైపు, ఈ సోదాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా పినరయి విజయన్ మద్దతుదారులు నిరసనలకు తెరతీశారు. తిరువనంతపురంలో మాజీ సీఎం నివాసంలో సోదా నిర్వహించి వెళుతున్న ఈడీ అధికారుల వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు వాహనంపై దాడి చేయడంతో కారు అద్దాలు పగిలిపోయాయి. ఈలోపు పోలీసులు నిరసనకారులను చెదరగొట్టి వాహనాన్ని అక్కడి నుంచి పంపించేశారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం 10 చోట్ల నేడు ఈడీ ఈ రెయిడ్స్‌ను నిర్వహించింది.

# కొమ్మూరులో బడి పిలుస్తుంది



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** కాకుమాను మండలం కొమ్మూరు గ్రామంలో బడి పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా మండల విద్యాశాఖ అధికారి. 2 కొల్లి విజయభాస్కర్ ఆధ్వర్యంలో బడి పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చుకొనుటకు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నటువంటి విద్యాభివృద్ధిని, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి వివిధ అంశాలను మరియు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న ప్రోత్సాహకాలను విజయభాస్కర్ తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నక్కల అగస్టీన్ పాల్గొని తల్లిదండ్రులకు వారి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు ఎంతగానో దోహదపడతాయని తెలియజేశారు. ప్రభుత్వ సహకారం తో పాఠశాలలకు అవసరమైన అనేక మౌలిక వసతులను కల్పించామని తెలిపారు. పాఠశాలలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దినందున వాటిని ఉపయోగించుకొని తల్లిదండ్రులు విద్యార్థుల అభివృద్ధికి పాటుపడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వి డి ఆర్ ఎస్ ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,కొమ్మూరు ప్రధానోపాధ్యాయులు రంగారావు , స్పెషల్ ప్రాథమిక పాఠశాల, కొమ్మూరు ప్రధానోపాధ్యాయులు బి.హనుమంత ప్రసాద్ , ఉపాధ్యాయిని మెరిగల శ్యాంకుమారి,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొమ్మూరు ప్రధానోపాధ్యాయురాలు పి.శాంతమ్మ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఉర్దూ) ప్రధానోపాధ్యాయిని ఖైరున్నిసా బేగం ఉపాధ్యాయిని రజియా బేగం మరియు ఆయా పాఠశాలల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రాణాలు తీసిన సరదా



- **గుంటూరు జిల్లాలో విషాదం..**
- **కాకుమాను మండలంలో కాలువలో గల్లంతై మృతి చెందిన ఇద్దరు బాలురు**

**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు జిల్లా ప్రతిపాడు నియోజకవర్గంలోని కాకుమాను మండలంలో విషాద సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని కొల్లిమర్ల గ్రామ సమీపంలోని మద్రాసు కాలువలో దిగిన ఇద్దరు బాలురు నీటి ప్రవాహానికి మృతి చెందారు. స్థానిక సమాచారం ప్రకారం, సుమారు 15 సంవత్సరాల వయసు గల చౌడవరం గ్రామానికి చెందిన గౌరీ ప్రసాద్, బాపట్ల జిల్లా కంకటపాలెం కు చెందిన ప్రేమ్ కుమార్ లు బంధువుల ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు వచ్చారు. కార్యక్రమం అనంతరం గ్రామ సమీపంలోని మద్రాసు కాలువ వద్దకు వెళ్లిన వారు నీటిలో దిగగా ప్రమాదవశాత్తు గల్లంతైనట్లు తెలుస్తోంది.

ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు కాలువ పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టగా, సమాచారం అందుకున్న తహసీల్దార్ బి వెంకట స్వామి, ఎస్ ఐ హరికృష్ణ మరియు అధికారులు సహాయక బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగించారు. బంధువుల ఇంటికి ఆనందంగా వచ్చిన ఇద్దరు బాలురు ఇలా ప్రమాదానికి గురవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. బుధవారం వారిరువురి మృతదేహాలను సహాయక బృందాలు కనుగొన్నారు.

# ఐటీడీపి నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్ రాజా శ్రీనివాస్



**ప్రత్తిపాడు (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రత్తిపాడు నియోజకవర్గం టీడీపీ అనుబంధ విభాగాల నియామకాలలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గ ఐటీడీపి వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్ రాజా శ్రీనివాస్‌ను శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు ఎంపిక చేశారు. తొలి నుండి తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ ఐటీడీపి లో చురుకుగా పనిచేస్తున్న రాజా శ్రీనివాస్ కు సముచిత స్థానం లభించిందని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా రాజా శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధిష్టానం అందించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మండలం నాయకులు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# టీడీపీ మహానాడు రికార్డు..

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడుకు రికార్డు స్థాయిలో స్పందన లభించింది. హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన ఈ మహానాడులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్లస్టర్లతో పాటు తెలంగాణ, అండమాన్, ఇతర దేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున కార్యకర్తలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. మొత్తం ఆరు లక్షల మంది కార్యకర్తలు మహానాడులో పాల్గొన్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 1875 క్లస్టర్ల ద్వారా కార్యకర్తలు తమ ఐడీ కార్డులతో హాజరు నమోదు చేసుకున్నారని తెలిపారు.

రామ్మోహన్ నాయుడు ఈ ప్రకటన చేయగానే మహానాడులో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు హర్షధ్వానాలు చేశారు. ఒక ప్రాంతీయ పార్టీ హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు నిర్వహించడం, లక్షలాది మంది వర్చువల్‌గా పాల్గొనడం రికార్డు అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# మోదీ 12 ఏళ్ల పాలనపై ప్రత్యేక కార్యక్రమాలు

- **ప్రధానిగా మోదీ పాలన దేశ అభివృద్ధికి స్వర్ణయుగం**
- **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్**



**విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం గత 12 ఏళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ పాలనలో ఆర్థిక సంస్కరణలు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠ పెరిగిందని పేర్కొన్నారు. జూన్ 5 నుంచి 21 వరకు కేంద్ర ప్రభుత్వ విజయాలు, అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని, జూన్ 8 నుంచి 14 వరకు కేంద్ర నిధులతో నిర్మితమవుతున్న ప్రాజెక్టులను సందర్శిస్తామని చెప్పారు. జూన్ 12 నుంచి 14 వరకు మీడియా సమావేశాల ద్వారా మోడీ ప్రభుత్వ 12 ఏళ్ల ప్రగతిని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేసి కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు.

మోడీ పాలనలో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి చేరుకుందని మంత్రి వివరించారు. సోషల్ సెక్యూరిటీ కవరేజ్ 19 శాతం నుంచి 64.30 శాతానికి పెరిగిందని, ఉచిత వంటగ్యాస్, సురక్షిత మంచినీటి సరఫరా, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది లబ్ధి పొందారని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ హైవేలు, గ్రీన్ కారిడార్లు, రైల్వే అభివృద్ధి, ఎలక్ట్రిక్ రైళ్ల వినియోగం వల్ల దేశంలో ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా వంటి కార్యక్రమాలతో సంపద సృష్టి పెరిగిందని, అంతర్జాతీయంగా భారతదేశానికి గౌరవం మరింత పెరిగిందన్నారు.

ఈ సందర్భంగా వైసీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న నిరసనలపై మంత్రి సత్యకుమార్ తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన లేకుండానే జగన్ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సామాజిక పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా ప్రజలకు భారీ స్థాయిలో లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ప్రజల మధ్య లేకుండా "విజిటింగ్ పొలిటీషియన్"లా వ్యవహరిస్తున్నందున జగన్‌కు వాస్తవ పరిస్థితులు తెలియడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలను ప్రజలు మరిచిపోలేదని మంత్రి విమర్శించారు. పోలీసు వ్యవస్థను ఉపయోగించి ప్రత్యర్థి పార్టీలను భయపెట్టి ఏకగ్రీవాలు చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేస్తోందని, ఎలాంటి దౌర్జన్యాలకు పాల్పడ బోదని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తిగా రాజ్యాంగబద్ధమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకే ఈ ప్రక్రియ జరుగుతోందని పేర్కొన్నారు. పాత్రికేయుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివ నారాయణ, రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, అధికార ప్రతినిధి యామినీ శర్మ, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ సందర్భంగా గో వధ జరగరాదు



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** బక్రీద్ పండుగ సందర్భంగా గో వధ జరగరాదని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ స్పష్టం చేశారు. ధృవీకరించి, అనుమతించిన జంతువులు మాత్రమే వధ శాలలకు తరలించాలని అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో శాంతి భద్రతలు, సామాజిక సామరస్యం, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య పరిరక్షణ దృష్ట్యా జిల్లా పరిపాలన యంత్రాంగం పలు ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. జిల్లాలో అనుమతి పొందిన వధ శాలలలో మాత్రమే జంతు వధ నిర్వహించాలన్నారు. తాత్కాలిక వధ శాలలు ఏర్పాటుకు మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులను సంప్రదించవచ్చని వివరించారు. పశుసంవర్ధక శాఖ ధృవీకరించిన, అనుమతించిన జంతువులను మాత్రమే వధించుటకు వధ శాలలకు తరలించాలని చెప్పారు. అనధికార వధ శాలలు, అక్రమ రవాణా, నిషేధిత జంతువుల వధ వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. మూడు సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఎద్దులను కూడా వధించరాదని అన్నారు. దేనికి ఉపయోగపడదని అధికారికంగా ధృవీకరించిన తరువాత మాత్రమే వధించుటకు అవకాశం ఉందని చెప్పారు. గర్భం దాల్చిన ఏ జంతువును వధించరాదని పేర్కొన్నారు. జిల్లాలో అనుమతించిన వధ కేంద్రాలను పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, ఇతర సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తారన్నారు. అక్రమ రవాణా, అనధికార వధలను అరికట్టేందుకు ప్రత్యేక ఆపరేషన్ బృందాలు/మల్టీ డిసిప్లినరీ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. పండుగ సందర్భంగా పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. మసీదులు, అనుమతించిన వధ కేంద్రాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు.

**సామాజిక మాధ్యమాలపై నిఘా**

సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు, వదంతులు, అభ్యంతరకర పోస్టులు ప్రచారం చేయరాదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టామని తెలిపారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా ప్రజలందరూ ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎటువంటి చట్ట ఉల్లంఘనకు సంబంధించిన సమాచారము, శాంతి భద్రతలు, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు తదితర అంశాలపై ఈ క్రింది ఫోన్ నంబర్లకు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

1. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ - 8688831391.
2. పశు సంవర్ధక శాఖ - 83330 86999.
3. గుంటూరు మునిసిపాల్ కార్పోరేషన్ - 9849908363.
4. పొన్నూరు మునిసిపాలిటి - 9849905834.
5. తెనాలి మునిసిపాలిటి - 9849905830.
6. ఎం.టి.ఎం.సి - 7093320018.
7. సబ్-కలెక్టర్ (I/c), తెనాలి - 9849904008.
8. రెవిన్యూ డివిజినల్ అధికారి, గుంటూరు - 9849904006.
9. జిల్లా పంచాయతి అధికారి - 9492758041.
10. సీఈఓ, జిల్లా ప్రజా పరిషత్, గుంటూరు - 9849903355.

# పేదల సేవే తెలుగుదేశం పార్టీ లక్ష్యం



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానాడు వేదికపై "పేదల సేవలో" అనే కీలక తీర్మానం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఢ టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... పేదల సేవ కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, "సమాజమే దేవాలయం -- ప్రజలే దేవుళ్లు" అనే సిద్ధాంతాన్ని నినాదంగా కాకుండా జీవన విధానంగా మార్చుకున్న నేత ఎన్టీఆర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంటి నాయకుల ఆలోచనలే పార్టీకి బలమని పేర్కొన్నారు.

పేదలకు సేవ చేయడం మాత్రమే కాదు, సమాజంలో "పేదవాడు" అనే పదమే లేకుండా చేయాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని గళ్ళా మాధవి అన్నారు. విలువలు, త్యాగాలు, సామాజిక బాధ్యతలకు నిలయంగా టీడీపీ నిలిచిందని చెప్పారు.

ప్రజల సాధికారత, తెలుగు జాతి ఆత్మగౌరవ పరిరక్షణ దిశగా పార్టీ నాయకత్వం చేస్తున్న కృషిని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు.

# 31వ తేదీన శ్రీనివాసునికి ఉదయాస్తమాన సేవ మహోత్సవం!




**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) :** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ తెనాలి పట్టణంలో శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన ఉదయాస్తమాన సేవా మహోత్సవం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు ఆర్. వి. కిరణ్ కుమార్ తెలిపారు. పట్నంలోని స్థానిక బాలాజీ పేట లోని నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రం గా రూపుదిద్దుకోనున్న కోట బద్రీనాథ్ గుప్తా గారి స్థల ప్రాంగణం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడుకొండల స్వామికి 49 వారాలపాటు వెంకటేశ్వర స్వామి గానామృతం నిర్వహించడం జరుగుతుందని గానామృతం ముగింపు సందర్భంగా 31వ తేదీన శ్రీనివాసునికి ఉదయాస్తమాన సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం సుప్రభాత సేవ తో ప్రారంభమయ్యే కార్యక్రమంలో అభిషేకం, తోమాల సేవ, సహస్రనామార్చన, శ్రీనివాస కళ్యాణం, గరుడసేవ, ఏకాంతసేవ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. అలాగే 30వ తేదీన గానామృతం ముగింపు కార్యక్రమానికి టిటిడి ఆగమ సలహాదారులు , జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆగమాధిపతి ప్రొఫెసర్ వేదాంతం. శ్రీ విష్ణు భట్టాచార్యులు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరుగుతుందనీ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని శ్రీనివాసుని ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మూర్తి వెంకటేశ్వర, మదుపల్లి చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ జంధ్యం రామారావు, ట్రస్ట్ విద్యా కమిటీ చైర్మన్ కోట బద్రీనాథ్ గుప్తా, కో ఆర్డినేటర్ అక్కల రామలింగేశ్వర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమోషన్ ఛానల్‌కు సహకరించాలి

- **జిల్లా కలెక్టర్‌ను కలిసిన సెక్రటేరియట్ ఇంజనీర్స్ సంఘం ప్రతినిధులు**



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ సంఘం ప్రతినిధులు బుధవారం జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రమోషన్ ఛానల్, "వన్ డిపార్ట్‌మెంట్ -- వన్ ఇంజినీరింగ్ అసిస్టెంట్" అంశాలపై కలెక్టర్‌కు వివరించారు.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్ కమిటీ నివేదిక ఆలస్యం కాకుండా త్వరితగతిన విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగుల పదోన్నతులు, పరిపాలనా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ జాయింట్ సెక్రటరీ జె. నాగరాజు తో పాటు జిల్లా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# క్లీన్ అండ్ గ్రీన్ 'గోదావరి పుష్కరాలు'




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో వచ్చే ఏడాదిలో గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. దీంతో ఇప్పటినుంచే ప్రభుత్వం దృష్టి సారించింది. గత అనుభవాల దృష్ట్యా ఈసారి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా కాలుష్య నియంత్రణను సీరియస్‌గా తీసుకుంది. క్లీన్ అండ్ గ్రీన్ నెస్ లో నిర్వహించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గోదావరి ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాన్ని ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తోంది. సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తోంది. గోదావరి పుష్కరాలపై దిశానిర్దేశం చేస్తోంది.

**గోదావరి పుష్కరాలు-2027పై కీలక నిర్ణయం :** అయితే తాజాగా గోదావరి పుష్కరాలు-2027పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గోదావరి సహా ప్రధాన నదుల కాలుష్య నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. పవన్ కల్యాణ్ ఆదేశాలతోపర్యావరణ, అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అలాగే నదుల కాలుష్య నివారణపై కార్యచరణ సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించినట్లు సమాచారం. వివిధ శాఖల హెచ్‌వోడీలకు నోడల్ అధికారులుగా బాధ్యతలుగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. దీంతో నదులు కాలుష్య నియంత్రణపై ఈ అధికారులు ఇప్పటి నుంచే రంగంలోకి దిగనున్నారు.

# మంత్రి లోకేష్ నిర్ణయంతో మహిళల్లో కొత్త ఆశలు: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మహానాడులో మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటన చారిత్రాత్మకం. రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని తీర్మానం చేయడం సాధారణ విషయం కాదు... అది మహిళల సాధికారతపై ఉన్న నిజమైన నిబద్ధతకు నిదర్శనం అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. దేశంలో ఎంతో మంది నాయకులు మహిళల గురించి మాట్లాడతారు, కానీ ఇలాంటి ధైర్యమైన నిర్ణయం తీసుకునే దమ్ము, సంకల్పం ఉన్న నాయకుడు మంత్రి లోకేష్ అని గర్వంగా చెబుతున్నానని తెలిపారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకున్నా... బిల్లు పాస్ అయినా కాకపోయినా తెలుగుదేశం పార్టీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం అని మంత్రి లోకేష్ ప్రకటించడం ఆయన గొప్ప నాయకత్వానికి నిదర్శనం. మహిళల పట్ల గౌరవం, వారికి రాజకీయంగా సమాన అవకాశాలు కల్పించాలనే ఆలోచన ఆయనలో ఎంత బలంగా ఉందో ఈ నిర్ణయం చెబుతోంది. నాయకుడు అంటే పదవి కాదు... సమాజానికి దిశా నిర్దేశం చేసే వ్యక్తి. ఆ లక్షణాలు మంత్రి లోకేష్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. మహిళల గౌరవం కోసం, వారి భవిష్యత్తు కోసం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చరిత్ర సృష్టిస్తుంది. యువ నాయకత్వం అంటే ఏమిటో, మహిళల పట్ల నిబద్ధత ఎలా ఉండాలో దేశానికే ఆదర్శంగా నిలిచేలా మంత్రి లోకేష్ ముందుకు సాగుతున్నారు. ఇప్పుడు యువనాయకులు మంత్రి లోకేష్ నాయకత్వంలో ఆ సంకల్పం మరింత బలపడింది. భవిష్యత్తులో మహిళలకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పించే దిశగా ఇది గొప్ప ముందడుగు అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# మహానాడు వేళ టీడీపీలో ఫుల్ జోష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో మునుపెన్నడూ లేనంత జోష్ కనిపిస్తోంది. పార్టీ వార్షిక పండుగ మొదటి రోజే టీడీపీకి భారీగా విరాళాలు వచ్చిపడ్డాయి. వివిధ నియోజకవర్గాల నేతలు, పారిశ్రామికవేత్తలు పార్టీ ఫండ్‌కు తమ వంతుగా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. కేవలం మొదటి రోజే ఏకంగా 11 కోట్ల రూపాయల విరాళాలు సమకూరాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో నేతలు ఈ చెక్కులను పార్టీకి అందజేశారు.

**విరాళాల వివరాలు :** ఈ విరాళాల వెల్లువలో నెల్లూరుకు చెందిన ప్రముఖ నేతలు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు అందరికంటే ముందు నిలిచారు. వారు పార్టీ బలోపేతం కోసం ఏకంగా రూ. 5 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించి తమ ఉదారతను చాటుకున్నారు. వారిని అనుసరిస్తూ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి రూ. 1.50 కోట్లు, మరో ప్రముఖ నేత సానా సతీష్ రూ. 1.50 కోట్ల ఆర్థిక విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేశారు.

## రైతు గోస-బిజెపి భరోసా బస్సు యాత్ర విజయవంతం చేయాలి.. బిజెపి మండల అధ్యక్షులు వేల్పుల రమేష్



పెద్దపల్లి, మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : రైతు గోస – బీజేపీ భరోసా బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం మధ్యానం 2 గంటకు పెద్దపల్లి జిల్లా పర్యటించనున్నారని బీజేపీ మండల అధ్యక్షులు, సర్పంచ్ వేల్పుల రమేష్ అన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్, వివిధ వరి,మొక్కజొన్న కేంద్రాలను సందర్శించనున్నారని, కావున ఈ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ,రైతులకు హాజరై ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఎల్లమ్మ తల్లికి భక్తుల బోనాలు



**-రాయికల్‌లో వైభవంగా పట్నాలు**

రాయికల్, మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : రాయికల్ పట్టణంలో ఎల్లమ్మ పట్నాల సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఇంటికో బోనంతో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఓడి బియ్యం పోసి తమ మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, బైండ్ల పూజారుల సంప్రదాయ ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తి శ్రద్ధల మధ్య జరిగిన ఈ వేడుకలో గౌడ సంఘం అధ్యక్షుడు ఏనుగందుల శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి బండి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## "బాల్య వివాహం బతుకు ఆగం"



**-ఉప్పుమడుగులో అవగాహన కార్యక్రమం**

రాయికల్, మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మహిళా సంక్షేమ వారోత్సవాల సందర్భంగా "బాల్య వివాహం బతుకు ఆగం" నినాదంతో బాల్య వివాహ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇంచార్జ్ అధికారి పడాల సురేష్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికలు విద్య, ఆరోగ్యం, భవిష్యత్ అవకాశాలను కోల్పోతారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా బాల్య వివాహాలను అరికట్టాలని పిలుపునిచ్చారు.ఐసిడిఎస్ జగిత్యాల ప్రాజెక్ట్ సీడీపీఓ జయప్రద మాట్లాడుతూ బాల్య వివాహ సమాచారం తెలిసిన వెంటనే 1098 లేదా 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న వారితో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.రాయికల్ ఏఎస్ఐ బాల్య వివాహ నిషేధ చట్టం-2006పై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ కొత్త కొండ రోజా గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లేపు గంగాధర్, సూపర్వైజర్లు,ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు

## బస్టాండ్ పక్కన ఉన్న సీయోను ప్రార్థన మందిరం గేటు విషయము

రామ్ మందిర్ ఏరియా, మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : గోదావరిఖని: గోదావరిఖని బస్టాండ్ పక్కన ఉన్న సీయోను ప్రార్థన మందిరం నిర్మాణం సింగరేణి సంస్థ అనుమతులతో ఏర్పాటు చేసినట్లు ప్రార్థన మందిరం బాధ్యులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఈ-చార్జింగ్ బస్సుల సౌకర్యం కల్పించిన నేపథ్యంలో, ప్రార్థన మందిరానికి సంబంధించిన గేటును మార్పు చేసినట్లు పేర్కొన్నారు.రహదారికి ఎదురుగా నిర్మానుష్యంగా ఉన్న సులబ్ కాంప్లెక్స్‌ను తొలగించి, అక్కడ సీయోను ప్రార్థన మందిరం గేటును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మార్పులు మున్సిపల్ మరియు సింగరేణి సంస్థల అనుమతులతోనే చేపట్టినట్లు వివరించారు.సింగరేణి ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు ప్రార్థన మందిరానికి తరచుగా వస్తుండటంతో, ప్రభుత్వం మరియు సింగరేణి సంస్థల అనుమతులతోనే ఈ నిర్మాణం కొనసాగుతున్నదని సీయోను ప్రార్థన మందిరం నిర్వాహకులు వెల్లడించారు.

# రైతు ధాన్యం తడిసే వరకు నిద్రపోయిన ప్రభుత్వం

**-కష్టాల్లో రైతుకు అండగా నిలిచింది కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిగారే**



మునుగోడు, మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : నేత చౌటుప్పల్ డివిజన్ ఇంచార్‌మునుగోడు నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు వ్యవస్థపై తీవ్ర విమర్శలు వ్యవసాయ అధికారులు ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్య ధోరణి వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. రైతులు రోడ్లపైకి వచ్చాక మాత్రమే సమీక్షలు, సమావేశాలు నిర్వహించడం "దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్టు" ఉందని విమర్శించారు.మార్చి చివరి నుంచే రైతులు ఐకెపి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తుండగా, మే చివరి వారంలో సమీక్షలు నిర్వహించడం రైతుల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్టేనని పేర్కొన్నారు.ప్రతి రబీ సీజన్‌లో ఎంత ఎకరాల్లో వరి సాగు జరుగుతుందో వ్యవసాయ శాఖ ముందుగానే నివేదికలు అందజేస్తుందని గుర్తుచేస్తూ-ఎన్ని కొనుగోలు కేంద్రాలు అవసరంఎన్ని గోదాములు సిద్ధంగా ఉండాలి?ఎన్ని లారీలు, ట్రాన్స్పోర్ట్ ఏర్పాట్లు కావాలిమిల్లర్లకు ఎప్పుడు సమాచారం ఇవ్వాలివంటి అంశాలపై ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో పనిచేయాల్సి ఉండగా, పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.ప్రభుత్వం చేతకానితనం, ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగా రైతుల ధాన్యం వర్షాల్లో తడిసిపోయిందని, రైతులు రోజుల తరబడి ఐకెపి సెంటర్ల వద్ద పడిగాపులు కాచాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పుడు "సమస్య ఉంది" అని ఎమ్మెల్యే స్వయంగా ఒప్పుకోవడం అంటే ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అంగీకరించినట్టేనని విమర్శించారు."రైతు పొలంలో చెమటోడ్చుతుంటే... ప్రభుత్వం కుర్చీల్లో కూర్చొని నిద్రపోయిందా?" అని ప్రశ్నించారు.ఎన్నికల సమయంలో రైతును "రైతు రాజు" అంటారని, కానీ ధాన్యం కొనుగోలు సమయంలో మాత్రం రైతును అనాథలా వదిలేస్తున్నారని మండిపడ్డారు.రైతు కోసం నేలమీద పోరాడింది కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గారేమునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి రైతుల సమస్యలపై మొదటి నుంచే అప్రమత్తంగా వ్యవహరించారని తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా పలుమార్లు సందర్శించి పరిశీలించారని, గోదాముల కొరత, ట్రాన్స్పోర్ట్ సమస్యలపై అధికారులకు అనేకసార్లు లేఖలు రాసి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని పేర్కొన్నారు."ప్రభుత్వ గోదాములు సరిపోవడం లేదు... వెంటనే ప్రైవేట్ గోదాములు ఏర్పాటు చేయాలి" అంటూ రైతుల తరఫున నిరంతరం అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారని గుర్తుచేశారు. చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన వడ్ల స్టోరేజ్ గోదాం కూడా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గారి చొరవ ఫలితమేనని స్థానిక రైతులు చెబుతున్నారని తెలిపారు.రైతు ధాన్యం వర్షానికి తడవకుండా కాపాడేందుకు మాజీ ఎమ్మెల్యే కృషి చేస్తుంటే, స్థానిక ఎమ్మెల్యే మాత్రం సమస్యలు తీవ్రమైన తర్వాత కూడా స్పందించకపోవడం బాధాకరమన్నారు."రైతు కోసం లేఖలు రాసిన నాయకుడు ఒకవైపు... రైతులను పట్టించుకోని పాలకులు మరోవైపు... ప్రజలు అన్నీ గమనిస్తున్నారు" అని హెచ్చరించారు.ఎన్నికల సమయంలో రైతు ప్రేమ చూపించి, సమస్యల సమయంలో రైతును ఒంటరిగా వదిలేసిన నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని స్పష్టం చేశారు.

## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డుతో ఇంటర్నేషనల్ అవార్డుకు ఎన్నికైన మిడిదొడ్డి నరసింహ



బి.ఎన్. రెడ్డి నగర్, మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : సామాజిక సేవలకు ప్రతిఫలంగా జూన్ 15, తెలంగాణ సారస్వత పరిషత్ బొగ్గులకుంటలో జరిగే అవార్డుల ప్రధాన ఉత్సవానికి సామాజిక సేవకు గాను గౌరవ డాక్టరేట్ అవార్డుతో పాటు ఇంటర్నేషనల్ అవార్డుకు, శ్రీ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మిడిదొడ్డి నరసింహ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో ఫౌండర్ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ 2021 లో మిడిదొడ్డి నరసింహ శ్రీ సేవా సామాజిక సేవా సంస్థను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆయన చేస్తున్న సామాజిక సేవలు గుర్తించి వివిధ రంగాల్లో వారికి అనాథలకి దివ్యాంగులకి నిరుపేదలకు చేస్తున్న సేవలకు గుర్తుగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డుతో పాటు ఇంటర్నేషనల్ అవార్డు అందజేస్తున్నట్లు, డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంతోమంది ముఖ్య అతిథులు హాజరవుతారని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అవార్డుకు ఎన్నికైన మిడిదొడ్డి నరసింహకు ఆయన అభినందనలు తెలిపారు

## ఆర్ ఎఫ్ సి ఎల్ కాంట్రాక్ట్ కార్మికుల డబ్బులు చెల్లింపు



**-ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ నిరసన**

రామ్ మందిర్ ఏరియా, మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : ఆర్ ఎఫ్ సి ఎల్ కాంట్రాక్టు కార్మికుల బాధితుల డబ్బుల చెల్లింపులు జాప్యాన్ని నిరసిస్తూ నాయకుడు "అంబటి" నరేష్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ, RFCL కాంట్రాక్ట్ కార్మికులకు బాధితుల డబ్బులను చెల్లించకపోవడంతో నిర్లక్ష్యం ఎమ్మెల్యే ఎన్నికల హామీలను నెరవేర్చకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు.నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు అంబటి నరేష్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనతో ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

## మైతాపూర్‌లో పంచాయతీ కార్మికులకు రూ.5 లక్షల ప్రమాద భీమా పాలసీ



**-సర్పంచ్ నాగమణి సొంత డబ్బులతో భీమా పాలసీల పంపిణీ**

రాయికల్, మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ తలారి నాగమణి పంచాయతీ కార్మికుల సంక్షేమం కోసం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని 8 మంది పంచాయతీ కార్మికులకు తలా రూ.5 లక్షల ప్రమాద భీమా పాలసీలు సొంత డబ్బులతో చేయించి, వాటి బాండ్లను రాయికల్ ఎంపీడీఓ చిరంజీవి చేతుల మీదుగా అందజేశారు.అదేవిధంగా కార్మికులకు సబ్బులు, షాంపూ, కొబ్బరి నూనె వంటి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సర్పంచ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు.ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు బొమ్మెన లక్ష్మి బాబు, బూస గంగమల్లయ్య, కొల్ల ప్రమీల నారాయణ, లింగంపల్లి లక్ష్మణ్, నేమిల్ల లత స్వామి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు

## ఖని;లో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన మద్దెల దినేష్ దంపతులు



రామ్ మందిర్ ఏరియా, మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : గోదావరిఖని : కులాంతర వివాహం చేసుకొని మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ తన సతీమణి సౌజన్యతో కలిసి గోదావరిఖనిలోని మున్సిపల్ టీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మద్దెల దినేష్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కుల వ్యవస్థ నిర్మూలనకు కులాంతర వివాహాలు అత్యంత అవసరమని భావించారని తెలిపారు. ఆ స్ఫూర్తితోనే అనేక మంది యువత ఆదర్శ వివాహాలు చేసుకొని తమ జీవితాలను ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. తాము కూడా అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో కులరహిత భావజాలాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.కులాలు, మతాలకు అతీతంగా వివాహాలు చేసుకోవడం వల్ల సామాజిక ఐక్యత పెరుగుతుందని అంబేద్కర్ ఎంతో ముందుగానే సూచించారని గుర్తు చేశారు. ఆదర్శ వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు మరింత చొరవ చూపాలని, కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.దేశంలో, రాష్ట్రంలో పరువు హత్యల పేరుతో కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కోరారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "డాక్టర్ అంబేద్కర్ స్కీమ్ ఫర్ సోషల్ ఇంటిగ్రేషన్ త్రూ ఇంటర్ క్యాస్ట్ మేరేజెస్" పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి, కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి రామగుండం నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. గౌస్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ పాల్గొని సౌజన్య--దినేష్ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# దోస్త్ ఎన్ సి సి,స్పోర్ట్స్ ధ్రువపత్రాల పరిశీలన



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : డిగ్రీ కళాశాలల ప్రవేశాలకు నిర్వహిస్తున్న దోస్త్ 2026–27 రెండవ విడతలో ఎన్ సి సి,స్పోర్ట్స్ విభాగాల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నిర్వహించడం జరిగింది.తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఎన్ సి సి 06,స్పోర్ట్స్ 03,వికలాంగులు 01,మొత్తం పది మంది ధృవపత్రాల పరిశీలనకు హాజరైనట్లు యూనివర్సిటీ దోస్త్ సమన్వయకర్త డాక్టర్ వాసం చంద్రశేఖర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ సి సి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి,ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.ఆర్.నేత,నరేష్,రవీందర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# డంప్ యార్డ్ ఏర్పాటుకు ససేమిరా ఒప్పుకోం..!

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టీకరణ**

**షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సిద్ధపూర్ తదితర ప్రాంతాల రైతులు**

**ఎమ్మెల్యేను కలుసుకుని గోడు వెళ్ళబోసుకున్న ప్రజలు**



షాద్నగర్ నియోజకవర్గం మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ యూనిట్ (డంప్ యార్డ్) ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని దీనికి తను ససే మీరా ఒప్పుకునే పరిస్థితి లేదని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యవహారంలో భాగంగా ఆయా గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. కొత్తూరు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, ఎస్ బి పల్లి అంబటి ప్రభాకర్, సురేష్, ఆగిర్ రవికుమార్ గుప్తా ఇంకా తదితర నాయకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను కలిసి డంపింగ్ యార్డ్ వ్యవహారాన్ని ఆయన ముందు ప్రస్తావించారు. ఇదివరకే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తదితర సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు ఎమ్మెల్యే శంకర్ వారికి వివరించారు. తప్పకుండా ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో తన వంతు కృషి చేస్తానని ఇందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కొంత సమయమును పాటించి ఆలోచించాలని ఎట్టి పరిస్థితుల్లో ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రసక్తి ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం వద్ద ప్రజలు నినాదాలు చేశారు

# నందిమేడారం కోర్టుకు
# లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా ఆకారి రాజేశం నియామకం



పెద్దపల్లి/ధర్మారం, మే 27(జర్నలిస్ట్ ఫైల్): నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టుకు లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా బోట్లవనపర్తి గ్రామానికి చెందిన న్యాయవాది ఆకారి రాజేశం నియమితులయ్యారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ సునీత కుంచాల నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవీకాలం మూడు సంవత్సరాల పాటు కొనసాగనుంది.ప్రస్తుతం ఆకారి రాజేశం నందిమేడారం అడ్వకేట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. ఆర్థిక స్థోమత లేని నిరుపేదలు, అట్టడుగు వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే ఈ నియామకం ప్రధాన ఉద్దేశమని కోర్టు వర్గాలు తెలిపాయి. అర్హులైన వారు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, సేవలు పొందవచ్చని పేర్కొన్నాయి. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించాయి. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత, నందిమేడారం అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి బోట్ల లక్ష్మీనర్సయ్యతో పాటు అసోసియేషన్ సీనియర్, జూనియర్ అడ్వకేట్లకు ఆకారి రాజేశం కృతజ్ఞతలు తెలిపారు.

# కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి అభినందనలు తెలిపిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



షాద్నగర్ నియోజకవర్గం మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గ సభ్యుల పనితీరుపై కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి సోమనాథ్ ప్రకటించిన మంత్రుల పనితీరు, ఫైల్స్ క్లియర్ చేయడం, అభివృద్ధి ర్యాంకుల జాబితాలో కేంద్ర మంత్రి శ్రీ జి కిషన్ రెడ్డి దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం అభినందనీయమని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలో వారి నివాసంలో జి కిషన్ రెడ్డిను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సేవలో కిషన్ రెడ్డి గారు చూపుతున్న నిబద్ధత, నిజాయితీ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమర్థత, ప్రజలతో నిరంతర అనుసంధానం వల్లే ఈ గుర్తింపు లభించిందని అన్నారు. దేశవ్యాప్తంగా ఉత్తమ ర్యాంకు సాధించిన మంత్రుల జాబితాలో తొలి వరుసలో నిలవడం తెలుగు ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కిషన్ రెడ్డి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# మహిళల భద్రతనే పోలీస్ ప్రాధాన్యత...

**వరంగల్ సీపీ -సన్ ప్రీత్ సింగ్:**



హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు.హనుమకొండలో మహిళల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు మరో ముందడుగు పడింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా భద్రతకు సంబంధించిన సందేశాలతో రూపొందించిన గోడ పత్రికను వరంగల్ సిపి- సన్ ప్రీత్ సింగ్ మంగళవారం హనుమకొండ పోలీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. "మహిళల రక్షణ కోసం భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళలు ఎక్కడైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. సమాజంలో మహిళలపై జరిగే వేధింపులు, నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన అవసరమని తెలిపారు. గోడ పత్రిక ద్వారా మహిళా హక్కులు, భద్రతా చర్యలు, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ వివరాలను ప్రజలకు చేరవేయడం లక్ష్యం అన్నారు.పోలీస్ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేస్తే మహిళలకు మరింత భద్రత కల్పించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక బృందాలు, షీ టీమ్స్ సమర్థంగా పనిచేస్తున్నాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డీసీపీ దార కవిత, అదనపు డీసీపీ రవి తదితర అధికారులు పాల్గొన్నారు.

# విదేశీ వాణిజ్యాన్ని అందిపుచ్చుకునేలా రైతులకు తోడ్పాటును అందించాలి

**వాణిజ్య,పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికారులను కోరిన కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**కలెక్టరేట్‌లో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం**




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లా రైతాంగానికి మరింత ప్రయోజనం కలిగేలా వాణిజ్య,పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా తోడ్పాటును అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను కోరారు.జిల్లా రైతాంగం తమ వ్యవసాయ ఉత్పత్తులను దేశ,విదేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్యపరంగా వారికి అనుసంధానం ఏర్పరచాలని అభిలషించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం వాణిజ్య,పరిశ్రమల మంత్రిత్వ శాఖ(డీ.జీ.ఎఫ్.టీ),ఎ.పీ.ఈ.డీ.ఎ,జాతీయ పసుపు బోర్డు,నాబార్డు,ఇండియా పోస్ట్ ల సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు.నూతన ఎగుమతిదారులను ప్రోత్సహించడం,ఎం.ఎస్.ఎం.ఈల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం,జిల్లాల స్థాయిలో ఎగుమతులను గణనీయంగా పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ-కామర్స్ ఎగుమతుల ప్రదర్శన,ట్రేడ్ కనెక్ట్ పోర్టల్,పసుపు, వరి, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి తదితర పంటల మార్కెట్ వైవిధ్యీకరణ అంశాలపై డీ.జీ.ఎఫ్.టీ అధికారులు,వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు,శాస్త్రవేత్తలు విచ్చేసి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన,అధిక దిగుబడులను అందించే పంటల సాగు,సస్య రక్షణ చర్యలు,పంట ఉత్పత్తుల మార్కెటింగ్,విదేశాలకు ఎగుమతులు,ఎరువులు,క్రిమిసంహారక మందుల వాడకం,సాగు నీటి యాజమాన్య పద్ధతులు తదితర అంశాల గురించి వివరిస్తూ,రైతుల సందేహాలను నివృత్తి చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ....నిజామాబాద్ జిల్లా రైతాంగం సేద్యపు రంగంలో ఆధునిక విధానాలు,శాస్త్రీయ పద్ధతులను అవలంభిస్తూ ఆదర్శ రైతులుగా పేరు పొందారని అన్నారు.ముఖ్యంగా ఆర్మూర్ ప్రాంత రైతులు అత్యధిక విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తారని,వ్యవసాయ ఉత్పత్తులు,నూతన వంగడాల విషయంలో అంకాపూర్ ప్రాంత రైతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు.ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగానికి ఆధునిక పద్ధతులలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ,విదేశీ వాణిజ్యంతో అనుసంధానం కలిగిస్తే ఈ ప్రాంత రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ ఆకాంక్షించారు.పురాతన,సంప్రదాయ పద్ధతుల స్థానంలో ఆధునిక సాగు విధానాలను తెలియజేయడం, కూలీల కొరతను అధిగమించేందుకు వీలుగా యంత్రీకరణను వినియోగించడం,దమార్కెటింగ్ మెలుకువలు, పసుపు పంట నాణ్యతను పెంపొందించే ప్రాసెసింగ్ విధానాలపై తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు.ఈ దిశగా నిజామాబాద్ జిల్లాను ఎగుమతి కేంద్రంగా ప్రకటిస్తూ,పసుపు,వరి రైతులకు అవగాహన పెంపొందించేందుకు వాణిజ్య,పరిశ్రమల మంత్రిత్వ శాఖ మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించడం ఈ ప్రాంత రైతాంగానికి మేలు చేకూరుస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.డీ.జీ.ఎఫ్.టీ ప్రాంతీయ సంచాలకులు ఎస్.ఎ.చవాన్ మాట్లాడుతూ....రైతులు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని అన్నారు.అప్పుడే వారికి గణనీయమైన లాభాలు సమకూరడంతో పాటు విదేశీ మారకద్రవ్యం పెరిగి రూపాయి మారకం బలపడుతుందని,ఇది ఒక రకంగా దేశానికి సేవ చేసినట్లు అవుతుందని సూచించారు.ప్రస్తుతం తెలంగాణ నుండి ఔషధాలు,ఇంజినీరింగ్ విడి భాగాలు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి జరుగుతున్నాయని,ఇదే కోవలో పసుపు,వరి,ఇతర వ్యవసాయ ఉత్పత్తులను కూడా అధిక మొత్తంలో ఎగుమతి చేయవచ్చని అన్నారు.ఫారిన్ ట్రేడ్ పాలసీని అనుసరిస్తూ విదేశీ ఎగుమతులకు ప్రభుత్వం తగిన రాయితీలు వర్తింపజేస్తూ,అనేక విధాలుగా ప్రోత్సహిస్తోందని అన్నారు.నేటి పరిస్థితుల్లో ఈ-కామర్స్ ప్రాధాన్యతను గుర్తెరిగి,అవగాహనను పెంపొందించుకోవాలని, తద్వారా తాము ఉంటున్న ప్రాంతం నుండే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ఉత్పత్తుల ఎగుమతులు,వ్యాపార లావాదేవీలు జరపవచ్చని సూచించారు.డీ.జీ.ఎఫ్.టీ ద్వారా జిల్లా రైతాంగానికి తగిన తోడ్పాటు అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు అధికారులు కేవీఎస్.శైలజ, ప్రత్యూష్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు విద్య,కే.జనార్ధన్ రెడ్డి,ఎ.పీ.ఈ.డీ.ఎ అధికారి నాయుడు, నాబార్డు డీ.జీ.ఎం ఎస్.ప్రవీణ్ కుమార్,పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సురేష్



కుమార్,జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్,వివిధ శాఖల అధికారులు, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

# సిద్దాపూర్ మరో "లగచర్ల" అవుతుంది..

**చెత్త పనులు మానండి .. దంపు కంపు ఆపండి.. షాద్ నగర్ ఆర్డీవోకు సిద్దాపూర్ పరిసర గ్రామాల ప్రజల వినతి పత్రం.. నిర్ణయం ఆపకపోతే ఆమరణ దీక్ష తప్పదని హెచ్చరిక.. అధికారులకు స్పష్టత లేకపోవడం బాధాకరమని వాఖ్య.. ప్రభుత్వ పెద్దల ప్రకటన విన్నాకే ఆందోళన విరమిస్తాం: సిద్దాపూర్ ప్రజలు. షాద్ నగర్ కు చేరిన సిద్ధాపూర్ డంప్ యార్డ్ పంచాయతీ**



షాద్నగర్ నియోజకవర్గం మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : పరిశ్రమలు అన్నారు.. ఉపాధి అన్నారు.. చివరికి రైతుల పొట్ట కొట్టి భూములు లాక్కున్నారు.. ఆ భూముల్లో ఇప్పుడు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి మా జీవితాలను నాశనం చేయాలనుకుంటున్నారు.. సరే.. రండి.. తేల్చుకుందాం.. దీనిపై ఆమరణ దీక్షకు కూడా సిద్ధం.. సిద్ధాపూర్ మరో లగచర్ల అవుతుంది అంటూ సిద్దాపూర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామాల పరిధిలో వ్యర్థాల నిర్వహణ యూనిట్ల ఏర్పాటు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్డీవో సరితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పరిసర గ్రామాలలో ఉన్న ప్రజలను ఇబ్బంది పెట్టేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే భారీ ఎత్తున ఆందోళనకు తమ సిద్ధమని ప్రకటించారు. ఇంతకుముందే సర్పంచులు రాజీనామా చేస్తామని హెచ్చరించిన సంగతి తెలిసిందే కాగా, ఇప్పుడు గ్రామస్తులు కూడా ఒక తాటి మీదికి వచ్చి పోరాటం చేయడంతో ఆందోళన రోజురోజుకు ఉధృతం అవుతుంది. ఇక్కడ నిజానికి ఆ యూనిట్ ను ఏర్పాటు చేస్తున్నారా.. లేదా.. అన్న దానిపై అధికారులు కూడా స్పష్టత ఇవ్వకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతుంది. దీనిపై ఒక అధికారిక ప్రకటన వస్తే తప్ప ఆందోళన విరమించేది లేదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించిన గ్రామస్తులు ఆర్డీవోకు ఈ వినతి పత్రాన్ని అందజేశారు.

**ఆమరణ దీక్షకు సిద్ధం..**

**మహిళా నాయకురాలు నుస్రత్ బేగం..**

రైతులకు న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం ఆపేది లేదనీ మహిళ నాయకురాలు నుస్రత్ బేగం హెచ్చరించారు.ఇప్పుడు వీళ్లు అనుకుంటున్న చెత్త సేకరణ యూనిట్ సమీపంలోనే పవిత్రమైన జాంగిర్ పీరు దర్గా ఉంది. అదేవిధంగా 1500 మందికి పైగా పిల్లలు చదువుతున్న ట్రైబల్ స్కూల్, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు.. అందుకే పోరాటం మొదలుపెట్టాం. రేపటి నుంచి అమరణ దీక్ష కూడా చేస్తాం. ప్రజా పాలన పేరిట ఇంకా ఎంతకాలం మోసం చేస్తారు.. మీ ప్రజా పాలనలో ప్రామాణికత ఎక్కడ ఉంది.., దీనిపై నిర్ణయం ప్రకటించకపోతే సిద్దాపూర్, రహీం తాండ, చింతకుంట, ఇనుముల నర్వ ఎస్బి పల్లి, కొడిచెర్ల తదితర గ్రామాల ప్రజలందరం ఆందోళనకు సిద్ధంగా ఉన్నాం.

**ఎవరు వచ్చినా అడ్డుకుంటాం.. మరో లగచర్ల చేస్తాం. అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ నేత**

15 రోజులుగా పార్టీలకు అతీతంగా యూనిట్ విషయంలో పోరాటం చేస్తున్నాం. దీనికి ఎవరు అడ్డు వచ్చినా ఆగేది లేదు. సిద్దాపూర్ ను మరో లగచర్ల చేస్తాం ఎవరు అడ్డు వచ్చినా ఊరుకునే పరిస్థితి లేదు.. అంటూ అంబటి ప్రభాకర్ హెచ్చరించారు. దీని కాలుష్యం వల్ల పిల్లల ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. భూములు అమ్మిన ఎవరూ కొనని పరిస్థితి ఏర్పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుంది. గత 15 రోజులుగా తాము ఎంత పోరాటం చేస్తున్నా, దానికి మీడియా మద్దతుతో పోరాటం వెలుగులోకి వస్తున్న అధికారులు ఎవరూ కనీస వివరణ కూడా ఇవ్వడం లేదు. ఈ యూనిట్ ఏర్పాటు పై స్పష్టత వచ్చేదాకా ఈ పోరాటం కొనసాగుతుంది.

**పార్టీ లేదు.. గీర్టీ లేదు.. పోరాటమే..**

**శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు**

రాజకీయంగా పార్టీలకు సేవలు అందిస్తాం.. కానీ సమస్య మా దాకా వచ్చినప్పుడు పార్టీ లేదు గెర్టీ లేదు.. పోరాటమే.. అంటూ కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి హెచ్చరించారు. దీనిపై ఇప్పటికి జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మెల్యే లకు వినతి పత్రాలు ఇచ్చాం. ఇక్కడ జేపీ దర్గా, పింజెర్ల అనంత పద్మ స్వామి లాంటి పవిత్ర ఆలయాలు ఉన్నాయి. ఇలాంటి చోట డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసుకోవాలనుకోవడం దారుణం. ఎమ్మెల్యే శంకరన్న కొత్తూరు మండల ప్రజలు ఎంతో ఆదరించి గెలిపించారు. ఈ సమస్యపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆయన ప్రకటనను బట్టి చర్యలు తీసుకుంటారని నమ్మకం ఉంది. నమ్మినోళ్లను మోసం చేయొద్దు. గత ప్రభుత్వం పరిశ్రమలు పెడతామంటూ ఈ భూములు సేకరించింది. అలాంటి భూమిలో ప్రస్తుత ప్రభుత్వం చెత్త నింపాలనుకోవడం సరైన నిర్ణయం కాదు. ఎమ్మెల్యే దీనిపై పోరాడితే ఆయన వెంట నడుస్తాం. ఎస్ టి ఎస్ సి ల పట్ల చులకన భావం వీడి పది తండాల పరిధిలో ఉన్న ఈ సమస్య పట్ల పాలకులు స్పందించాల్సిన అవసరం ఉంది. ఈ సందర్భంగా దీనిపై అధికారులకు కూడా సరైన స్పష్టత లేదని గ్రామస్తులు ఆందోళనకారులు అధికారుల తీరుపై మండిపడ్డారు..

# మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

,షాద్ నగర్ నియోజకవర్గ మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల పరిధిలోని పులిచెర్లకుంట తండాలో విషాద ఘటన చోటుచేసుకుంది కొత్తూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పులిచెర్లకుంట తండాకు చెందిన పత్లావత్ తులచ్య (36) అనే వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు మృతుడి తల్లి శ్రీమతి పత్లావత్ ధర్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తులచ్యకు సుమారు 16 సంవత్సరాల క్రితం శంషాబాద్ మండలం పెద్దతూప్ర తండాకు చెందిన మూడవత్ శారదతో సాంప్రదాయ పద్ధతిలో వివాహం జరిగింది వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు అయితే తులచ్య మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో భార్య శారద పిల్లలను తీసుకుని తన పుట్టింటికి వెళ్లిపోయిందని తెలిసింది అప్పటి నుంచి తులచ్య కూలి పనులు చేస్తూ వచ్చిన డబ్బులతో ప్రతిరోజూ మద్యం సేవించేవాడని ఆరోగ్యం కూడా క్షీణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు భార్యా పిల్లలు దూరంగా ఉండటంతో తరచూ మనస్తాపానికి గురయ్యేవాడని సమాచారంఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తులచ్య ఇంటి సిమెంట్ కప్పుకు ఉన్న చువ్వాకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు ఉదయం సుమారు 9:55 గంటలకు ఇంటికి వచ్చిన తల్లి కుమారుడు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించడంతో చుట్టుపక్కల వారిని పిలిచింది స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దించారు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు,

# సంపులో పడి మహిళ మృతి

**కేసు నమోదు చేసిన కొత్తూరు పోలీసులు,**

,షాద్ నగర్ నియోజకవర్గ మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని ఎస్‌బీ పల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది గ్రామానికి చెందిన ఎమ్మే సంతోష (41) అనే మహిళ ఇంట్లో ఉన్న నీటి సంపులో పడి మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది కొత్తూరు పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎమ్మే రమేష్ (52) మంగళవారం తెల్లవారుజామున సుమారు 5:30 గంటల సమయంలో పాలు పిండేందుకు బయటకు వెళ్లాడు ఆ సమయంలో అతని భార్య సంతోష ఇంట్లోనే ఉన్నట్లు తెలిపారు అనంతరం ఉదయం సుమారు 7:30 గంటలకు తన చిన్న కుమారుడు నాగచైతన్య ఫోన్ చేసి తల్లి ఇంట్లోని నీటి సంపులో పడి ఉండటాన్ని గమనించినట్లు తెలిపాడు దీంతో వెంటనే ఇంటికి చేరుకున్న రమేష్, తన భార్య సంపులో పడి మృతి చెందినట్లు గుర్తించాడు మృతురాలు గత పది సంవత్సరాలుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించారు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ప్రమాదవశాత్తు సంపులో పడి మృతి చెందినట్లు భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న కొత్తూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు,

# కొత్తూరులో ఇంటి తాళం పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాల చోరీ,



,షాద్ నగర్ నియోజకవర్గ మే 27 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బంగారం వెండి ఆభరణాలు మరియు మొబైల్ ఫోన్‌ను అపహరించిన ఘటన కలకలం రేపింది ఈ ఘటనకు సంబంధించిన వివరాలను కొత్తూరు పోలీసులు వెల్లడించారు పోలీసుల కథనం ప్రకారం కొత్తూరు గ్రామంలోని రైల్వే స్టేషన్ రోడ్‌కు చెందిన శ్రీ గొల్ల కుమార్ (32), వృత్తిరీత్యా డ్రైవర్, తేదీ 26.05.2026 న ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు ఆయన తేదీ 23.05.2026 న మధ్యాహ్నం డ్రైవింగ్ డ్యూటీకి వెళ్లగా తన భార్య శ్రీమతి శృతి కాంతి ఇంట్లోనే ఉన్నారని తెలిపారు అనంతరం ఆమె తేదీ 24.05.2026 న సాయంత్రం ఇంటికి తాళం వేసి తమ స్వగ్రామమైన వికారాబాద్ జిల్లా మొమిన్‌పేట్ మండలం చక్రంపల్లి గ్రామానికి వెళ్లినట్లు పేర్కొన్నారు తేదీ 26.05.2026 న ఉదయం సుమారు 05:00 గంటల సమయంలో డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చిన గొల్ల కుమార్, ఇంటి తాళం పగులగొట్టబడినట్లు గమనించారు ఇంటి తలుపు కొద్దిగా తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా తాళం చెవి బయట పడిఉండగా బీరువా తెరిచి చూసే సరికి అందులో ఉన్న బంగారు వెండి ఆభరణాలు అలాగే డ్రెస్సింగ్ టేబుల్ డ్రార్ లో ఉంచిన పాత ఐఫోన్ మొబైల్ ఫోన్ కనిపించలేదు చోరీకి గురైన బంగారు వస్తువుల్లో పెద్ద చెవిపోగులు చిన్న చెవిపోగులు గొలుసు వంకీ ముక్కుపుడక చిన్న ఉంగరం ఉండగా మొత్తం సుమారు రెండు తులాల బంగారం అపహరించబడినట్లు తెలిపారు అలాగే వెండి వస్తువుల్లో కాళ్ల పట్టీలు వెండి నాణేలు చిన్న పిల్లల నడుము గొలుసు ఉండగా మొత్తం సుమారు 30 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారుఈ ఘటనపై గుర్తు తెలియని వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరగా కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు,

## శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుకలు జరుపుకోవాలి



- జిల్లా ప్రజలకు ఎస్పీ వకుల్ జిందాల్ శుభాకాంక్షలు

గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) : త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను జిల్లా ప్రజలు శాంతి, సామరస్య వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ ఆయన హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రధాన మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు మొబైల్ పెట్రోలింగ్ వాహనాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని చెప్పారు. పండుగ సందర్భంగా ఎలాంటి అపోహలు, ఉద్రిక్తతలకు తావులేకుండా స్థానిక ప్రజలతో సమన్వయం పెంపొందించాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలపై కూడా ప్రత్యేక నిఘా కొనసాగుతోందని ఎస్పీ స్పష్టం చేశారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ రోజున ప్రార్థనా స్థలాలు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక అమలు చేస్తున్నామని, ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు.

## మహానాడు సందర్భంగా తాడిశెట్టి తనయుల అన్నదానం



గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :మహానాడు ను పురస్కరించుకొని రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్ తనయులు తాడిశెట్టి ఉత్తేజ్, తాడిశెట్టి ఉల్లాస్ లు గుంటూరు నగరంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరు రైల్వే స్టేషన్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా తాడిశెట్టి ఉత్తేజ్, తాడిశెట్టి ఉల్లాస్ లు మాట్లాడుతూ.. తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పిన మహా పర్వదినం మహానాడు అన్నారు. తెలుగు జాతి ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీ శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రజల జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అన్నంరాజు సాయిరాం, సంబరాసు వాసు, వెచ్చా కృష్ణమూర్తి, పోతురాజు, వెంకట్, స్టేషన్ బాబు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమలో మహానాడును నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకలను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో తొలి రోజు ఘనంగా జరిగింది. నియోజకవర్గ పరిధిలోని 12 క్లస్టర్లలో మహానాడు ప్రత్యక్ష ప్రసార వీక్షణ ఏర్పాట్లు చేసి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు.

ప్రతి క్లస్టర్ కేంద్రంలో పెద్ద ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి మహానాడు కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించారు. కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు భోజనాలతో పాటు మజ్జిగ పంపిణీ చేసి ప్రత్యేక ఆతిథ్యం అందించారు. వేసవి వేడిని దృష్టిలో ఉంచుకుని చేసిన ఈ ఏర్పాట్లు కార్యకర్తలను ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని సంపత్ నగర్, పట్టాభిపురం షాదిఖానా, నిమ్మల గార్డెన్స్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మహానాడు వీక్షణ కేంద్రాలను సందర్శించారు. అక్కడ పార్టీ శ్రేణులతో కలిసి మహానాడు కార్యక్రమాలను వీక్షించి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు.

పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వేదికగా మహానాడు నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు.

## గుంటూరులో జూన్ 2న మెగా జాబ్ మేళా

- పోస్టర్ విడుదల చేసిన కమిషనర్ మయూర్ అశోక్



గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులో జూన్ 2న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ బుధవారం విడుదల చేశారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి సహకారంతో హిందూ ఫార్మసీ కళాశాల, అమరావతి రోడ్‌లో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు ఉద్యోగ మేళాల ద్వారా యువతకు అవకాశాలు కల్పిస్తోందన్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాబ్ మేళాలో 30 కంపెనీలు పాల్గొంటున్నాయని, సుమారు 1,100 ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. 10వ తరగతి నుంచి బీటెక్, పీజీ వరకు చదివిన యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. ఇంకుక్స్ ఏఐ, క్లౌడ్ మెల్లో టెక్నాలజీస్, మాల్టెక్ సొల్యూషన్స్, ప్రైమరియా హెల్త్ కేర్ వంటి సంస్థలు హాజరవుతున్నాయని తెలిపారు. విద్యార్హతలను బట్టి నెలకు రూ. 9 వేల నుంచి రూ. 35 వేల వరకు వేతనాలు ఉండే అవకాశముందని పేర్కొన్నారు.

జూన్ 2న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫోటోలతో నేరుగా హాజరుకావచ్చన్నారు. యువత ముందుగా నైపుణ్యం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, జాబ్ డ్రైవ్ ప్రాంగణంలో స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కల్పించినట్లు వెల్లడించారు.

## చారిత్రాత్మకం మహానాడు 2026 వేడుకలు: ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



వినుకొండ ( జర్నలిస్ట్ ఫైల్ ): తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక అయిన మహానాడు ప్రాముఖ్యతను, దాని నిరంతర ఆవశ్యకతను వివరిస్తూ వినుకొండ గంగినేని కళ్యాణ మండపంలో జరుగుతున్న వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ప్రసంగించారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమర్థ సారథ్యం, మంత్రి నారా లోకేష్ యువ నాయకత్వం, మరియు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పర్యవేక్షణలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఈ మహానాడు వేడుకలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిణామాలకు అద్దం పట్టే మహానాడు ప్రధాన ఉద్దేశాన్ని, పార్టీ ప్రవేశపెడుతున్న కీలక రాజకీయ, ఆర్థిక, సంక్షేమ తీర్మానాల వివరాలను ఆయన శ్రేణులకు వివరించారు. సాంకేతికతను జోడిస్తూ పార్టీ శ్రేణులను మరింత అనుసంధానం చేసేందుకు రూపొందించిన "డిజిటల్ మహానాడు" ప్రత్యేకతలను తెలియజేస్తూ, ఈ పండుగ జ్ఞాపకార్థం ప్రచురించిన "మహానాడు ప్రత్యేక సంచిక"ను జీవి ఆంజనేయులు ముఖ్య నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ... పార్టీకి అసలైన బలం, ఊపిరి కార్యకర్తలేనని కొనియాడారు. కష్టకాలంలోనూ జెండాను గుండెలకు హత్తుకుని, పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమించిన ప్రతి కార్యకర్తకూ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని, రాబోయే రోజుల్లో వారి కష్టానికి తగిన గుర్తింపు, గౌరవం దక్కుతాయని స్పష్టం చేశారు. చారిత్రక తీర్మానాలతో, డిజిటల్ హంగులతో సాగుతున్న ఈ రెండు రోజుల మహానాడు పండుగలో ప్రతి ఒక్కరూ పసుపు కండువాలతో తరలివచ్చి భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు.

## తూర్పులో పండుగలా మహానాడు



- ఎమ్మెల్యే నసీర్ ఆదేశాలతో 12 క్లస్టర్లలో ఉత్సాంగా సంబరాలు
- ఐదో క్లస్టర్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పెమ్మసాని
- లీడర్ నుంచి కేడర్ వరకు హాజరు
- రాష్ట్ర ప్రగతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్న నాయకులు

గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :తెలుగుదేశం పార్టీ మహానాడు రాష్ట్రానికి దిశ, దశ చూపుతుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మహానాడు సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ పసుపు పండగ సంబరంగా సాగింది. మొత్తం 12 క్లస్టర్లలో మహానాడు వేడుకలు నిర్వహించారు. ఐదో క్లస్టర్ లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని కేడర్ ను ఉత్సాహపరిచారు. తూర్పు నియోజకవర్గంలో ఆర్టీసీ కాలనీలోని ఎన్ పి ఎస్ ఫంక్షన్ హాల్, సీతానగర్ లోని ఎస్వీఆర్ కన్వెన్షన్ హాల్, యాదవ బజార్లోని కాపు కమ్యూనిటీ హాల్, పాత గుంటూరులోని నారాయణమ్మ కళ్యాణ మండపం, కొత్తపేటలోని ఫ్యాన్సీ కళ్యాణ మండపం, కొత్తపేటలోని పిఎస్ఆర్ కాంప్లెక్స్, పొన్నూరు రోడ్ లోని ఎమ్మెల్యే కార్యాలయం, ఏటుకూరు రోడ్డు లోని ఫ్యాన్సీ ప్లాజా, ఎల్ఆర్ కాలనీలోని వినాయక ఫంక్షన్ హాల్, శారద కాలనీలోని సాతులూరి చలపతిరావు ఫంక్షన్ హాల్, డొంక రోడ్ లోని స్టార్ మస్తానయ్య కన్వెన్షన్ హాల్, నెహ్రూ నగర్ లోని పామర్తి ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో మహానాడు వేడుకలు సాగాయి. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ టీడీపీ నాయకులు మాట్లాడుతూ కష్టాలెన్నైనా రానీ, కన్నీళ్లు ఎన్నైనా పొంగనీ పసుపు జెండాను గుండె లోతుల్లో నింపుకున్నామని తెలిపారు. విశ్వ వేదికపై తెలుగు నేలను పులకింపజేసిన యుగ పురుషులు నందమూరి తారక రామారావు ఆశయ సాధన సీఎం చంద్రబాబుతో నెరవేరుతుందని చెప్పారు. మహానాడు కార్యక్రమం అభివృద్ధి, సంక్షేమానికి దిక్సూచి అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలోనే తెలుగు జాతి ఆత్మ గౌరవం పెరిగిందని తెలిపారు. నవ్యాంధ్రకు రాజధాని అమరావతి నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పం చిరస్థానంగా నిలిచిపోతుందని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోనూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నసీర్ శాసనసభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి అభివృద్ధికి కొత్త రూపు వచ్చిందన్నారు. ఆయా కార్యక్రమాలలో గుంటూరు తూర్పు నియోజకవర్గ అబ్జర్వర్ ఈశ్వర్, క్లస్టర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్,డీజల్ ధరలు తగ్గించాలి




బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్ ): కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలు పై వరుస భారాలు వేసే విధంగా పెట్రోల్, డీజల్ ధరలను పెంచుకుంటూ పోతున్నాడని గడిచిన నెల రోజులలో మూడు సార్లు పెంచి ప్రజల పై భారాలు మోపడం జరిగిందని పెంచిన పెట్రోల్, డీజల్ ధరలు తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నాడు బ్రహ్మంగారిమఠం ప్రజా సంఘాల కార్యాలయం నందు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వరుసగా ఇంధన, గ్యాస్ ధరలు పెంచి ప్రజల పై వరుస భారాలు మోపుతుందని అన్నారు. గడిచిన పదిహేను రోజులలో మూడు సార్లు ఇంధన, గ్యాస్ ధరలు పెంచిందని అన్నారు. ఎప్పుడూ లేనంత రీతిలో వరుసగా పెట్రోల్, డీజల్ పై ఇప్పటి వరకు 7 రూపాయలు వరకు పెంచి మరింత భారం వేసిందని అన్నారు. నరేంద్ర మోదీ పొదుపు వాడకం అని ఇంధనం తగ్గించాలని, బంగారం కొనడం ఆపాలని ప్రజలకు ఉచిత సలహాలు ఇస్తూ ఒక దేశ ప్రధాని హోదాలో కాకుండా సలహాలు ఇవ్వడం విచిత్రంగా ఉందని అన్నారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడం విడనాడాలని తక్షణం పెంచిన ధరలు తగ్గించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సానా గోవింద్ సన్న బోయిన హరి లు పాల్గొన్నారు.

## ఆర్మీలో చేరుటకు ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష

గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :2027 నియామక సంవత్సరానికి గాను, అగ్నిపథ్ పథకం, రెగ్యులర్ కేడర్ కింద భారత సైన్యంలో చేరడానికి ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సి. ఇ. ఇ) నిర్వహించడం జరుగుతుందని గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ అధికారి కల్నల్ రజత్ సువర్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అగ్నిపథ్ పథకం, రెగ్యులర్ కేడర్ కింద భారత సైన్యంలో చేరడానికి నిర్వహించే ఆన్‌లైన్ సి. ఇ. ఇ, 2026 జూన్ 1 నుండి జూన్ 12 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 14 జిల్లాల్లో గల వివిధ పరీక్షా కేంద్రాలలో ప్రారంభమవుతుందన్నారు. ఈ జిల్లాలలో అనంతపురం, గుంటూరు, వై. ఎస్. ఆర్ కడప, కర్నూలు, నంద్యాల, ఎస్. పి. ఎస్ నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, రాజమండ్రి, ఎన్. టి. ఆర్ ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్షా సూచనలను చదవవచ్చని, మాక్ టెస్ట్ పేపర్లను ఝఝ. యశీఱఅఱఅఎఱఖుఖుతీఎ. అఱ. అఅ వెబ్‌సైట్‌లో ప్రాక్టీస్ చేయవచ్చన్నారు. అభ్యర్థులు ఈ ఆన్‌లైన్ పరీక్షను తెలుగు, హిందీ, ఆంగ్లంతో సహా మొత్తం 13 భాషలలో ఏదో ఒక భాషలో రాయవచ్చన్నారు. ఆన్‌లైన్ సి. ఇ. ఇలో అర్హత సాధించిన అభ్యర్థులను, తదుపరి తేదీలలో గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్, విశాఖపట్నం ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ ల ద్వారా నిర్వహించే రిక్రూట్‌మెంట్ ర్యాలీల సమయంలో, శారీరక పరీక్షలు, ధృవపత్రాల పరిశీలన కోసం పిలవడం జరుగుతుందని చెప్పారు.

## గుంటూరులో సుందరమైన, సురక్షిత కూడళ్లు ఏర్పాటు చేయాలి

- జీఎంసీ అధికారులకు కలెక్టర్ సాయికాంత్ వర్మ ఆదేశాలు
- రహదారులు తవ్వకాలపై కఠిన నిబంధనలు
- డయేరియా కేసులు రాకుండా తాగునీటి పైప్‌లైన్‌ల ఆడిట్ చేయాలి



గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరు నగరంలో సుందరమైన, శాస్త్రీయమైన, సురక్షిత కూడళ్లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, గుంటూరు నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి సి. యం. సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన కూడళ్లు, రహదారులను గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏపీయూఐఏఎంఎల్ ప్రతినిధులు రూపొందించిన ప్రతిపాదనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. హిందూ కాలేజీ కూడలి, బి. ఆర్. నాయుడు కూడలి, కలెక్టర్ కార్యాలయం జంక్షన్, మూడు బొమ్మల జంక్షన్, చుట్టుగుంట, మెడికల్ క్లబ్ జంక్షన్‌ల సుందరీకరణతో పాటు వీఐపీ రహదారిలో ల్యాండ్‌స్కేపింగ్ పనులపై కమిషనర్ వివరాలు అందించారు.

**రహదారులు తవ్వకూడదు**

రహదారి నిర్మాణంలో నిర్దేశిత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రోడ్లు నిర్మించిన తర్వాత కనీసం రెండేళ్ల పాటు తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేబుళ్లు, పైప్‌లైన్‌లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ కెమెరాలు వంటి పనులను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం సంబంధిత సంస్థలతో ముందస్తు సమావేశాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.

**తీగలు కనిపించకూడదు**

జంక్షన్ల వద్ద ఎక్కడా విద్యుత్ తీగలు వేలాడుతూ కనిపించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు అనువుగా టేబుల్ టాప్‌లు, హైమాస్ట్ లైటింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్ శాస్త్రీయంగా ఏర్పాటు చేయాలని సూచించారు. కూడళ్ల వద్ద ఫౌంటెన్లు, సూచిక బోర్డులు, కాబుల్ స్టోన్ మార్గాలు ఆకర్షణీయంగా ఉండాలన్నారు. మీడియన్లు, రహదారుల్లో ఏర్పాటు చేసే విద్యుత్ దీపాలు కూడా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని చెప్పారు. ఫుట్‌పాత్‌లు నగరమంతా ఒకే నమూనాలో ఉండాలని, గ్రీన్ బెల్ట్‌లు, నీడనిచ్చే చెట్ల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**డయేరియా కేసులు నమోదు కాకూడదు**

త్రాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించిన కలెక్టర్.. నగరంలో ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తాగునీటి పైప్‌లైన్‌ల ఆడిట్ నిర్వహించి వెంటనే అంచనాలు సిద్ధం చేసి అనుమతులు పొందాలని చెప్పారు. నీటి కలుషితం జరిగితే పూర్తి బాధ్యత ఇంజినీరింగ్ అధికారులదేనని హెచ్చరించారు.

**పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి**

జాతీయ రహదారి వెంట పారిశుధ్య పనుల్లో మెరుగుదల తీసుకురావాలని, ముఖ్యంగా అండర్‌పాస్‌ల వద్ద పోస్టర్లు అంటించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు.

దోమల నివారణ కోసం యాంటీ లార్వా కార్యకలాపాలు ముమ్మరం చేయాలని, నీటి నిల్వ ప్రాంతాల్లో గంబూషియా చేపలను విస్తృతంగా వదలాలని బయాలజిస్ట్‌ను ఆదేశించారు.

సమావేశంలో అదనపు కమిషనర్ జి. సాంబశివరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ సురేష్, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్, ఏపీయూఐఏఎంఎల్ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో పసుపు పండగ

- 12 క్లస్టర్లలో ఘనంగా డిజిటల్ మహానాడు నిర్వహణ,భారీ ఎల్ఈడి స్క్రీన్లు, వేలాదిగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు
- సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33% సీట్లు కేటాయించాలని తెలుగుదేశం పార్టీ తీర్మానం పై హర్షం వ్యక్తం



మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్) : మంగళగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ మహానాడు కార్యక్రమం పసుపు పండగను తలపించేలా అత్యంత వైభవంగా జరిగింది. నియోజకవర్గంలోని 12 క్లస్టర్ల పరిధిలో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసి, భారీ ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా మహానాడు కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై మహానాడును విజయవంతం చేశారు.

ప్రతి క్లస్టర్ కేంద్రంలో పసుపు జెండాలతో, పార్టీ కండువాలతో సందడి నెలకొంది. రాష్ట్ర నాయకత్వం ప్రసంగాలను కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకత్వం ఇచ్చిన దిశానిర్దేశం కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.

క్లస్టర్-1 మరియు క్లస్టర్-2 సమావేశాలు కుంచనపల్లిలోని శ్రీ శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా, క్లస్టర్-3 మరియు 4 సమావేశాలు నులకపేటలోని శ్రేయో ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. క్లస్టర్-5 సమావేశం యర్రబాలెంలోని డిబీఎన్ ఫంక్షన్ హాల్‌లో, క్లస్టర్-6 సమావేశం లిటిల్ విలేజ్ బ్యాంకెట్ హాల్‌లో, క్లస్టర్-7 సమావేశం పెదవడ్లపూడిలోని వై గార్డెన్స్‌లో నిర్వహించారు.

అలాగే క్లస్టర్-8 సమావేశం మంగళగిరిలోని చిల్లపల్లి నాగేశ్వరరావు కళ్యాణమండపంలో, క్లస్టర్-9 సమావేశం మార్కండేయ కళ్యాణమండపంలో, క్లస్టర్-10 సమావేశం పాత మంగళగిరిలోని భావనాఋషి స్వామి కళ్యాణమండపంలో నిర్వహించారు. క్లస్టర్-11 సమావేశం దుగ్గిరాలలోని జంపాల కళ్యాణమండపంలో, క్లస్టర్-12 సమావేశం ఈమనిలోని బలరాం గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది.

రాష్ట్రంలో 2029 సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33% సీట్లు కేటాయించాలని తెలుగుదేశం పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తున్నామని,మహిళా సాధికారతకు, రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం అభినందనీయమని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు .టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ దూరదృష్టి నాయకత్వంలో మహిళలకు మరింత ప్రాధాన్యత లభించడం ఆనందదాయకమని . మహిళల అభివృద్ధి, సమాన అవకాశాల కల్పనలో ఈ నిర్ణయం మైలురాయిగా నిలుస్తుందని నాయకులు తెలిపారు

మహానాడు సందర్భంగా అన్ని కేంద్రాల్లో కార్యకర్తలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు భోజన వసతులు, కూర్చునే సదుపాయాలు, డిజిటల్ ప్రసార వ్యవస్థలను సమకూర్చారు. వేలాదిగా తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు "జై తెలుగుదేశం", "జై చంద్రబాబు", "మన మంగళగిరి -మన లోకేష్ " అంటూ నినాదాలతో సభా ప్రాంగణాలను మార్మోగించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## 33 శాతం మహిళా రిజర్వేషన్ ప్రకటన అభినందనీయం



○ మహానాడులో కేంద్ర సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించడం మహిళా సాధికారత దిశగా చారిత్రాత్మక నిర్ణయమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో బుధవారం నిర్వహించిన మహానాడు-2026 డిజిటల్ క్లస్టర్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

నల్లచెరువు సమీపంలోని సంపత్‌నగర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లు, భారత్‌పేటలోని మదర్ తెరిసా కమిటీ హాల్, టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన డిజిటల్ మహానాడు కార్యక్రమాలకు పెమ్మసాని హాజరై కార్యకర్తలతో కలిసి కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడు టీడీపీ కార్యకర్తలకు మహా పండుగలాంటి కార్యక్రమమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపునకు అనుగుణంగా ఈసారి మహానాడును డిజిటల్ క్లస్టర్ విధానంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు.

టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి అనే ద్వంద్వ లక్ష్యాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని పెమ్మసాని పేర్కొన్నారు. పబ్లిక్ వైఫై ద్వారా ప్రజలకు అందుబాటు ధరల్లో ఇంటర్నెట్ సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు. హోటళ్లు, బస్టాండ్లు, ఇతర ప్రజా ప్రదేశాల్లో ప్రజలు సులభంగా ఇంటర్నెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమాల్లో పలువురు టీడీపీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిషేధిత జంతువుల వధ, అక్రమ రవాణాపై కఠిన చర్యలు

○ బక్రీదు సందర్భంగా చట్టాలను పాటించాలి

○ జంతు హింసకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవు

○ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హెచ్చరిక



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బక్రీదు పండుగ సందర్భంగా జంతువుల వధ, రవాణా, సంరక్షణకు సంబంధించిన ప్రభుత్వ చట్టాలు, నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర వ్యవసాయ పశుసంవర్ధక శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జంతువుల రవాణా, సంరక్షణ , వధకు సంబంధించి ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని, ఇవి జాతీయ స్థాయిలో రూపొందించబడినప్పటికీ, అనుమతులు , నిషేధాలు రాష్ట్రానికొక విధంగా ఉంటాయని మంత్రి తెలిపారు.


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాంసాహార అవసరాల కోసం మేకలు, గొర్రెలు, పందులు, కోళ్లు, బాతులు, చేపలు , పునరుత్పత్తికి వినియోగించని గేదెలను మాత్రమే వధించేందుకు అనుమతి ఉందన్నారు. అయితే ఆవులు, దూడలు , ఒంటెల వధను రాష్ట్రంలో పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. పశువులను రవాణా చేసే సమయంలో వాటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జంతు సంరక్షణ చట్టాలకు అనుగుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పరిమితికి మించి వాహనాల్లో పశువులను తరలించడం, నిషేధిత జంతువులను వధించడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఎవరైనా ఆవులు, దూడలు, ఒంటెలను వధించినా లేదా నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేసినా, జంతు హింస నివారణ చట్టం, ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధం , పశుసంరక్షణ చట్టం ప్రకారం కఠిన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

బక్రీదు సందర్భంగా క్షేత్రస్థాయిలోని పశువైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలతో సమన్వయం చేసుకుని అనధికార పశువుల వధను అరికట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ చట్టాలు, నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం సమీప పోలీస్ అధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

జంతు సంరక్షణ, గోవధ నిషేధ చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించి, చట్టబద్ధంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రజలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

## మహానాడులో కోటి యాభై లక్షల విరాళం అందించిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్)** :తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకల్లో తొలి రోజు విరాళాలు అందించిన నేతలు, అభిమానుల జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభలో స్వయంగా ప్రకటించారు.

పార్టీ బలోపేతానికి సహకరించిన వారిని అభినందిస్తూ, మరింత మందికి స్ఫూర్తి కలిగించాలనే ఉద్దేశంతో విరాళదాతల పేర్లను సభా వేదికపై వెల్లడించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పార్టీకి రూ. 1.5 కోట్లు విరాళంగా అందించినట్లు చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

సానా సతీష్ బాబు పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముందుండి సహకరిస్తున్నారని ఆయన ప్రశంసించారు.

విరాళదాతల పేర్ల ప్రకటనతో మహానాడు సభ ప్రాంగణంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. పార్టీ కోసం సేవాభావంతో ముందుకు వస్తున్న నాయకులు, వ్యాపారవేత్తలు, అభిమానులను చంద్రబాబు అభినందించారు.

పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తరించేందుకు, సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు ఇటువంటి సహకారం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

# తెనాలిలో ప్రతిష్టాత్మకంగా హైబ్రిడ్ మహానాడు

○ నియోజకవర్గంలో 10 క్లస్టర్లలో డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు :ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్చువల్ హైబ్రిడ్ మహానాడు కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. తెనాలి నియోజకవర్గంలో 10 క్లస్టర్లలో ప్రత్యేక డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేసి మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

తెనాలిలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హైబ్రిడ్ మహానాడు వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం తదితర అంశాలపై మహానాడులో చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ప్రత్యేక గౌరవం, గుర్తింపు కల్పిస్తామని పేర్కొన్నారు.

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ప్రధాన బలమని, కార్యకర్తలు సంతోషంగా ఉంటేనే నాయకత్వం విజయవంతమవుతుందని ఆలపాటి అన్నారు. రెండు రోజుల పాటు జరిగే హైబ్రిడ్ మహానాడు కార్యక్రమాన్ని కార్యకర్తలంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర క్రిస్టియానా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ ఖుద్దీస్, మహిళా నాయకురాలు మధు కోనేరు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీలో కార్యకర్తలే రథసారథులు

○ కార్యకర్తల అభీష్టం మేరకే అభ్యర్థుల ఎంపిక: మంత్రి సవిత

○ పార్టీ అభివృద్ధికి రూ.50 లక్షల విరాళం



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్)** : తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలే అసలైన రథసారథులని, వారి అభీష్టం మేరకే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేస్తారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. మంగళగిరిలో నిర్వహించిన టీడీపీ హైబ్రిడ్ మహానాడులో "కార్యకర్తే అధినేత" తీర్మానంపై ఆమె ప్రసంగించారు.

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను బాధ్యతాయుతమైన పౌరులుగా, ప్రజా సమస్యల పరిష్కారంలో క్రమశిక్షణ కలిగిన నాయకులుగా తీర్చిదిద్దుతోందని మంత్రి తెలిపారు. సామాన్య కార్యకర్తలకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, పొలిట్‌బ్యూరో సభ్యులుగా ఎదిగే అవకాశాలు కల్పిస్తున్న ఏకైక పార్టీ టీడీపీయేనన్నారు. ఐవీఆర్ సర్వేలో కార్యకర్తలు మెచ్చిన నాయకులకే పార్టీ టిక్కెట్లు దక్కుతాయని స్పష్టం చేశారు.

పార్టీ స్థాపకుడు ఎన్.టి. రామారావు బడుగు, బలహీన వర్గాలకు ఆత్మగౌరవం తీసుకొచ్చారని కొనియాడారు. తెలుగుజాతి అభ్యున్నతికోసం టీడీపీ ఆవిర్భవించిందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతోందన్నారు.

తెలుగుదేశం పార్టీని "పొలిటికల్ యూనివర్సిటీ"గా అభివర్ణించిన మంత్రి సవిత, పార్టీ అనేక మందిని రాష్ట్ర, కేంద్ర స్థాయిలో కీలక పదవులకు తీసుకెళ్లిందన్నారు. సామాన్య కార్యకర్తలకు రాజకీయంగా ఎదిగే వేదిక టీడీపీ కల్పిస్తోందని తెలిపారు. కార్యకర్తలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు "ట్రిపుల్ ఈ" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు.

పార్టీ కోసం శ్రమించే కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రమాదవశాత్తు కార్యకర్త మరణిస్తే కుటుంబం ఇబ్బందులు పడకుండా రూ. 5 లక్షల ప్రమాద బీమా అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారతకు తొలి ప్రాధాన్యం ఇచ్చిన పార్టీ కూడా టీడీపీయేనని పేర్కొన్నారు. మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడంలో ఎన్టీఆర్ కీలక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తుచేశారు.

మంత్రి సవిత ప్రసంగానికి మహానాడు వేదికపై విశేష స్పందన లభించింది. కార్యకర్తల ప్రాధాన్యం, పార్టీ నిర్మాణంలో వారి పాత్రను వివరించిన తీరు సభలో ఉత్సాహాన్ని నింపింది. ప్రసంగం అనంతరం సీఎం చంద్రబాబు ఆమెను అభినందించి తన పక్కన కూర్చోబెట్టుకున్నారు.

మహానాడు వేదికగా పార్టీ అభివృద్ధి కోసం పలువురు నేతలు విరాళాలు ప్రకటించారు. మంత్రి సవిత పార్టీకి రూ. 50 లక్షల విరాళం అందించినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

# ఓటు బ్యాంక్ రాజకీయాలకు చెక్

○ అక్రమ చొరబాట్లు, అసహజ జనాభా మార్పులపై కేంద్రం కీలక నిర్ణయం అభినందనీయం

○ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్) :** దేశ భద్రత, సార్వభౌమత్వం, సామాజిక సమతుల్యతకు పెను ముప్పుగా మారుతున్న అక్రమ చొరబాట్లు మరియు అసహజ జనాభా మార్పులపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ స్వాగతించారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అభినందించారు.

జస్టిస్ నవలేకర్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి "దేశం ముందు -- రాజకీయాలు తర్వాత" అనే తన నిబద్ధతను చాటుకుందని ఆమె పేర్కొన్నారు. దేశ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదనే సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు.

దశాబ్దాలుగా ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం అక్రమ వలసలను ప్రోత్సహించిన శక్తులు దేశ భద్రతను ప్రమాదంలోకి నెట్టాయని యామినీ శర్మ విమర్శించారు.

కొన్ని రాష్ట్రాల్లో అసహజ జనాభా మార్పులు, సరిహద్దు చొరబాట్లు, నకిలీ పత్రాల మాఫియా కార్యకలాపాలు పెరగడం ఆందోళనకర పరిణామమన్నారు. ఇటువంటి పరిణామాలు జాతీయ భద్రతకు ముప్పుగా మారుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నట్లుగా అక్రమ చొరబాట్లు కేవలం ఒక రాష్ట్ర సమస్య కాదని, ఇది దేశ భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశమని అన్నారు. దేశ పౌరుల హక్కులు, ఉద్యోగాలు, వనరులు మరియు సామాజిక సమతుల్యతను కాపాడటం ప్రతి బాధ్యతాయుత ప్రభుత్వ కర్తవ్యమని స్పష్టం చేశారు.

గత 12 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్స్ నుంచి సరిహద్దు భద్రత బలోపేతం వరకు, ఉగ్రవాదంపై ఉక్కుపాదం నుంచి అక్రమ చొరబాట్ల నియంత్రణ వరకు పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని ఆమె గుర్తు చేశారు. దేశాన్ని అస్థిరపరచే కుట్రలు, అక్రమ చొరబాట్లు, జనాభా అసమతుల్యతను అరికట్టడంలో ఈ కమిటీ నివేదిక కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు.

దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయానికి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సాదినేని యామినీ శర్మ కోరారు.

## ఇంధన ధరలపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం మానుకోవాలి

○ ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో ఇంధన ధరల అంశంపై కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విమర్శించారు. సీఎన్‌జీ ధరల పెంపును రాజకీయ లాభాల కోసం వక్రీకరించి కేంద్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

మాధవ్ మాట్లాడుతూ, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల హెచ్చుతగ్గులు దేశీయ ధరలపై ప్రభావం చూపడం సహజమని తెలిపారు. అయినప్పటికీ సాధారణ ప్రజలపై భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సందర్భాల్లో ఎక్సైజ్ సుంకాలను తగ్గించి ఉపశమనం కల్పించిందన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా బలమైన స్థాయిలో నిలిచిందని, కరోనా వంటి సంక్షోభ సమయంలో కూడా దేశాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిన ప్రభుత్వం బీజేపీదేనని పేర్కొన్నారు. ప్రజలకు ఉచిత ఆహార ధాన్యాలు, రైతులకు పీఎం కిసాన్, మహిళలకు ఉజ్వల యోజన, పేదలకు గృహాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు.

కాంగ్రెస్ హయాంలో అవినీతి, ఆర్థిక అవ్యవస్థ, విధానాల లోపాలతో దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్న విషయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. ప్రస్తుతం దేశంలో మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి, డిజిటల్ రంగంలో వేగంగా పురోగతి సాధిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాలతో ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

దేశ ప్రజలు కాంగ్రెస్ రాజకీయాలను నమ్మే పరిస్థితిలో లేరని, వాస్తవాలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం మానుకోవాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.

## ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేస్తా



○ ప్రతి బాధ్యత తనకు ఒక కొత్త అనుభవాన్ని నేర్పింది

○ అదనపు సంచాలకులు (ఇంచార్జి) గా నియమితులైన పోతుల కిరణ్ కుమార్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అధికారులు తనకు కల్పించిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగానని, సమాచార శాఖలో నిర్వర్తించిన ప్రతి బాధ్యత తనకు కొత్త అనుభవాన్ని, విలువైన పాఠాలను నేర్పిందని అదనపు సంచాలకులు (ఇంచార్జి) గా నియమితులైన పోతుల కిరణ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం జాయింట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న పి. కిరణ్ కుమార్ సేవలను గుర్తించిన ప్రభుత్వం, ఆయనకు అడిషనల్ డైరెక్టర్ (ఇంచార్జి) గా పదోన్నతి కల్పించిన నేపథ్యంలో బుధవారం విజయవాడలోని ఎన్టీఆర్ పరిపాలనా భవనంలో ఉన్న కమిషనర్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

**అనుభవమే నాకు పాఠం:** ఈ సందర్భంగా అదనపు సంచాలకులు (ఇంచార్జి) గా నియమితులైన పోతుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ... సమాచార శాఖలో సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో పనిచేయడం నాకు ఎంతో విలువైన అనుభవాన్ని ఇచ్చిందన్నారు. ప్రతి బాధ్యత నాకు కొత్త పాఠాన్ని నేర్పిందన్నారు. సహచర ఉద్యోగులు, అధికారుల సహకారం వల్లే నేను ఈ స్థాయికి చేరుకోగలిగానని కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులందరినీ ఒక కుటుంబంగా భావించి, పరస్పర సమన్వయంతో శాఖాభివృద్ధికి పాటుపడుతానని ఆయన స్పష్టం చేశారు.

**ప్రజాహితమే లక్ష్యం:** ప్రభుత్వ సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ కీలక పాత్ర పోషిస్తోందని, ఈ బాధ్యతను మరింత మెరుగ్గా, అంకితభావంతో నిర్వహిస్తానని పి. కిరణ్ కుమార్ వెల్లడించారు.

**అభినందనలు తెలిపిన అధికారులు:** అభినంధనలు తెలియజేసినవారిలో జాయింట్ డైరెక్టర్లు ఐ. సూర్యచంద్రరావు, సీఐఈ ఓ. మధుసూధన, ఆర్ఐఈ డాక్టర్ టి. నాగరాజ, డిప్యూటీ డైరెక్టర్లు పి. వెంకట్రాజ్ గౌడ్, డి. రమేశ్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఏఎస్ వీరభద్రరావు, కే. నారాయణ రెడ్డి, పి. రాజశేఖర్, డాక్టర్ కె. తిరుపాలయ్య, ఎస్వీ మోహన్ రావు, గణాంక విభాగం నుంచి నాగరాజు, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# ఆసుపత్రుల పనితీరు మెరుగుపడకుంటే చర్యలు తప్పవు

○ ఐవీఆర్ఎస్ ఫలితాల ఆధారంగా వెనుకబడిన ఆసుపత్రులపై ఆరోగ్య శాఖ ఫోకస్

○ సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం




**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్) :** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వెనుకబడిన ప్రభుత్వ ఆసుపత్రులపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఐవీఆర్ఎస్ (×ఎ=హా) ద్వారా రోగుల నుంచి సేకరించిన సేవల సంతృప్తి నివేదికల ఆధారంగా పనితీరులో వెనుకబడిన ఆసుపత్రులపై ప్రత్యేక సమీక్ష చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రులు, బోధన ఆసుపత్రుల వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లు, సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య అధికారులను బుధవారం అమరావతి, విజయవాడలకు పిలిపించి ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహించారు. ఆసుపత్రుల పనితీరును మెరుగుపరిచేందుకు ఈ తరహా సమీక్షలు నిర్వహించడం ఇదే తొలిసారని అధికారులు పేర్కొన్నారు.

పనితీరు సరిగా లేని వైద్యులు, సూపరింటెండెంట్లకు సంబంధిత హెచ్‌వోడీ కార్యాలయాలు సంజాయిషీ నోటీసులు జారీ చేశాయి. వైద్యుల అందుబాటు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, పారిశుద్ధ్యం, రోగుల పట్ల వైఖరి, మౌలిక సదుపాయాల నిర్వహణ వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ వర్క్‌షాప్‌లకు ముందు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమై ప్రజా వైద్య సేవల్లో అలక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేసినట్లు తెలిసింది.

గత నెల 25 నుంచి మే 25 వరకు ఆసుపత్రులకు వచ్చిన రోగుల నుంచి ఐవీఆర్ఎస్ విధానంలో సేకరించిన అభిప్రాయాల ఆధారంగా అట్టడుగున ఉన్న 20 ప్రాథమిక, పట్టణ ఆరోగ్యకేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య అధికారులతో మంగళగిరిలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండియన్ మాట్లాడుతూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఇకపై సహించబోమని స్పష్టం చేశారు. సీఎం, మంత్రి ఈ విషయంలో చాలా స్పష్టంగా ఉన్నారని తెలిపారు. ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించిన సమాచారంలో 95 శాతం వరకు విశ్వసనీయత ఉందని, అన్ని ప్రభుత్వ శాఖలు దీనినే ప్రామాణికంగా తీసుకుని చర్యలు చేపడుతున్నాయని పేర్కొన్నారు. సంతృప్తి స్థాయిలో 81.25 శాతం నుంచి 52.86 శాతం మధ్య పనితీరు నమోదైన ఆసుపత్రుల వైద్యుల నుంచి కమిషనర్ వివరణ కోరారు. పలువురు వైద్యులు దూర ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతున్న పరిస్థితులు కూడా ఆయన దృష్టికి వచ్చాయి. వరుసగా రెండు, మూడు సార్లు పనితీరు బలహీనంగా నమోదైన మెడికల్ ఆఫీసర్లకు హెచ్చరికలు జారీ చేశారు. పనితీరులో తక్షణ మార్పు కనిపించకపోతే చర్యలు తప్పవని మరోసారి హెచ్చరించారు. ఇదే సమయంలో 100 శాతం సంతృప్తి స్థాయి సాధించిన 30 మంది వైద్యులను ప్రత్యేకంగా అభినందించారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు వారు అనుసరిస్తున్న విధానాలను ఇతరులకు వివరించేలా చేశారు. ఈ సదస్సుకు 26 జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హాజరుకావడం విశేషం.

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు ఆధ్వర్యంలో 10 జిల్లాల్లో పనితీరులో వెనుకబడిన 20 సెకండరీ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులతో కుంచనపల్లిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆసుపత్రుల వారీగా పనితీరును సమీక్షించి, సేవల్లో మెరుగుదల లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర జిల్లాల అధికారులు వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467